
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025 | 5





రాజమహేంద్రవరం వైపు గోదావరి బండ్ పనులు

రాజమహేంద్రవరం వైపు అభివృద్ధి పరుగు

రేపు, ఎల్లుండి కేంద్ర బృందం పర్యటన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం (ఐఎంసిటి) ఈ నెల 10,11 తేదీల్లో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమి బసు నేతృత్వంలో 8 మంది సభ్యులతో కూడిన బృందం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తుందన్నారు. ఈ బృందం సోమవారం ఉదయం విజయవాడ చేరుకుని తాడేపల్లిలోని ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో క్షేత్ర పర్యటన చేపడుతుందన్నారు. ఒక బృందం ప్రకాశం, బాపట్ల జిల్లాలను సందర్శిస్తుందని.. రెండో బృందం ఏలూరు ,కృష్ణా, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ బృందం తుఫాన్ నష్టం, పునరావాస చర్యలు, ప్రభుత్వ యంత్రాంగం స్పందన వంటి అంశాలను పరిశీలించి నివేదికను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పిస్తుందన్నారు. బృందం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ,సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బృందంతో సమన్వయం చేసేందుకు విపత్తు నిర్వహణ డైరెక్టర్ ప్రఖార్ జైన్, రాష్ట్ర స్థాయి అనుసంధాన అధికారిగా ఏపీఎస్‌డీఎంఏ ఈడీ వెంకట దీపక్‌ను నియమించారని తెలిపారు.

రేపు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక) సోమవారం యథాతథంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు వ్యయప్రయాసలకు లోను కాకుండా డివిజన్, మండల స్థాయి కేంద్రాలు గ్రామ వార్డు సచివాయాల్లో అర్జీలు సమర్పించి పరిష్కారం పొందవచ్చన్నారు.1100 టోల్‌ఫ్రీ నెంబరు లేదా మీకోసం .ఏపీజీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొవ్వూరులో గోదావరి బండ్ పార్కు దుస్థితి ఇది..



చిట్టడవిలా ప్రాంగణం

కొవ్వూరు వైపు అభివృద్ధి దిగదుడుపు

ఇటు ఓకే.. అటు షాకే!

ఇంతలో ఎంత తేడా.. రాజమహేంద్రవరం, కొవ్వూరు ఈ జిల్లాలోనివే.. గోదావరికి అటూ ఇటూ ఉంటాయి.. రాజమహేంద్రవరం వైపు గోదావరి బండ్ చూస్తే ఆహా ఎంత అందంగా ఉందో అనిపిస్తుంది.. అంతే కాదు.. ఇటీవల అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అదే కొవ్వూరు వైపు చూస్తే చింతే.. చాలా అధ్వానంగా ఉంటుంది. ఈ చిత్రాల్లోనే చూడండి.. చిట్టడవిలా ఎలా ఉందో.. కలెక్టరమ్మా.. ఒకసారి చూడమ్మా.. - కొవ్వూరు



దారి.. చూపారు!

జలదారులివే..

కాకినాడ నుంచి రాజమహేంద్ర వరం, రాజమహేంద్రవరం-విజయవాడ, రాజమహేంద్ర వరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నరసాపురం, నర సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూ రు వరకు జలరవాణా రూట్లను గుర్తించారు. ఈ మార్గాల్లో పలు పరిశ్రమలకు కార్గో రవా ణాతో పాటు పర్యాటక బోట్లను నడిపేందుకు అనుమతులిస్తూ ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానించారు. కాకినాడ నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలంతో పాటు పలు ఇతర మార్గాల్లోను భారీ రివర్ క్రూయిజ్‌లను నడపవచ్చని ప్రతిపాదించారు. ఇటీవల ఎంపిక చేసిన జల రవాణా మార్గాల్లో వ్యాపారాలు చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి.కింగ్‌హాం కాలువ అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తర్వాత వీటితో చర్చలు జరిపి సరకు, పర్యాటక రవాణాకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టనున్నారు.

జల రవాణాకు మార్గం సుగమం

- కాకినాడ టూ పుదుచ్చేరి
- బకింగ్‌హం కెనాల్‌కు మంచిరోజులు
- పురాతన జలరవాణాకు పచ్చజెండా
- ఐడబ్ల్యూఏఐతో సర్కారు ఒప్పందం
- రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధి
- ఐదేళ్ల పాటు ఎంవోయూ అమలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. ఈ మార్గంలో గోదావరి,కృష్ణా నదుల మీదుగా సరుకు రవాణా, పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఈ కాలువకు పూర్వ వైభవం తెచ్చే దిశగా రంగం సిద్ధమవుతోంది.ఈ మేరకు కాలువ అభివృద్ధికి ఇన్నేళ్లకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో ఎంవోయూ కుదిరింది. ఐదేళ్ల పాటు అమల్లో ఉండనున్న ఒప్పందం మేరకు ఈ రెండూ కలిసి బకింగ్‌హం కెనాల్ అభివృద్ధి, జల రవాణా మార్గాల అన్వేషణ, కాలువల డ్రెడ్జింగ్, రివర్ క్రూయిజ్ పర్యాటకాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి. తొలుత రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధికి ఐడబ్ల్యూఏఐ శ్రీకారం చుట్టనుంది.

నాడు ఎంతో ప్రసిద్ధి

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువ బ్రిటిష్ కాలంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కాకినాడ నుంచి మొదలయ్యే ఈ కాలువ గోదా వరి, కృష్ణా మీదుగా తమిళనాడులోని విల్లుపురం వరకు 796 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్ర పరిధిలో 257 కి.మీ. వరకు ఉంది. కాకినాడ నుంచి గోదావరి మీదుగా తమిళనాడు వరకు అప్పట్లో జల రవాణా కింద సరుకులు భారీగా ఎగుమతి,దిగుమతి అయ్యేవి. అయితే క్రమేపీ కాలువ పూర్తిగా పూడుకుపోవ డంతో ప్రభుత్వాలు గాలికొదిలేశాయి.

ఒప్పందాలు ఇలా..

జల రవాణాకు డిమాండ్ పెరగడం, కారుచౌక రవాణామార్గం కావడంతో కాలువను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణ యించారు.ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువలను అభివృద్ధి చేసే ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) తోను చర్చలు జరిపారు.ఈ మేరకు వారం కిందట ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో కాలువను రూ.80 కోట్లతో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి.ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నౌకల రాకపోకలకు వీలుగా కాలు వల్లో పూడిక తీయడం, ఓడలు రాకపోకలు సాగించేలా వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టం ఏర్పాటు, నావిగేషన్ వ్యవస్థ తీర్చిదిద్దడం,కాలువల్లో రివర్ క్రూయిజ్‌లు నడిపేలా సహా యపడడం వంటివన్నీ మౌలిక సదుపాయాల రూపంలో తీర్చిదిద్దనుంది. సెకండ్‌పార్టీ కింద రాష్ట్రప్రభుత్వం తరపున జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాత రివర్ క్రూయిజ్ నౌకలు బెర్తింగ్ అవడానికి కావాల్సిన భూముల కేటా యింపు, బకింగ్ హం కాలువలో డ్రెడ్జింగ్ తర్వాత తవ్వితీసిన భారీ బురద, మట్టిని నిల్వ చేసేందుకు తగిన స్థలాలు, సరుకు రవాణా, పర్యాటక నౌకల రాకపోకలు, వెస్సెల్ ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఐదేళ్ల పాటు ఇవన్నీ ఈ రెండు ఒప్పందం ప్రకారం చేయా లని ఎంవోయూలో ప్రస్తావించారు.ఈ నేపథ్యం లో ఇన్నేళ్ల తర్వాత బకింగ్ హం కెనాల్ అభి వృద్ధికి మార్గం సుగమం కానుంది.

ఎన్ని అవకాశాలో..

బకింగ్‌హం కాలువ ద్వారా సరుకు రవాణాకు మళ్లీ ఊపిరిలూదాలని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది.ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడిపోయాయి.మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు బకింగ్‌హం కాలువ అభివృద్ధికి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చేలా ఒప్పించారు. ఒప్పందానికి ముందే ప్రభుత్వం తరఫున పది జల రవాణా మార్గాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసే లా ప్రైవేటు సంస్థలను టెండర్ల ద్వారా ఆహ్వానించింది.ఈ మార్గాల్లో డ్రెడ్జింగ్ అనంతరం రవాణా కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలు సాగించేలా నిబంధనలు రూపొందించారు.





అంబేడ్కర్ మునిమనవడు రాజారత్న అశోక్ అంబేడ్కర్, బౌద్ధ భిక్షువులకు స్వాగతం పలుకుతున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

పాండవుల మెట్టకు 1800 ఏళ్లు

బుద్ధిజం ద్వారానే సమాజ వికాసం- రాజారత్న అశోక్ అంబేడ్కర్

కోరుకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బుద్ధిజం ద్వారానే సమాజ వికాసం జరుగుతుందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్ ముని మనవడు రాజా రత్న అశోక్ అంబేడ్కర్ పేర్కొన్నారు.కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో పాండువుల మెట్ట వద్ద శనివారం నిర్వహించిన భారతీయ బౌద్ధ వారసత్వ సాంస్కృతిక ఉత్సవంలో ఆయన మాట్లాడారు. వేదాలు, మనుస్మృతిలో ఎక్కడా కుల ప్రస్తావన లేదని దళితులను ఒక్కో రాష్ట్రంలో ఒక్కోపేరుతో పిలుస్తున్నారన్నారు. పాండవుల మెట్ట రెండో శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన బౌద్ధ వారసత్వ స్థలం.. ఈ కొండపై బౌద్ధ సన్యాసులు నివసించిన గదులు, చైత్యం,స్తూపాలు, పూజ గది, డ్రెయినేజీ వ్యవస్థ, పెద్ద హాలు తవ్వకాల్లో బయట పడ్డాయన్నారు. ఈ స్థలం దాదాపు 1800 సంవత్సరాల పురాతన చరిత్ర కలిగి ఉందని తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కార్తీకమాసంలో పిల్లలు, పెద్దలు పాండవుల మెట్టకు వచ్చి చారిత్రక, ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతారన్నారు. బౌద్ధ మత వ్యాప్తి, ఆధ్యాత్మికత, పురాతన భారతీయ నిర్మాణ కళకు ప్రతీకగా నిలిచేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో టిబెటన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ పథకం కింద అభివృద్ధి చేస్తామన్నారు. బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి రూ.21 కోట్లతో డీపీఆర్ రూపొందించినట్టు తెలిపారు. సమావేశంలో బుద్దిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చిలకపాటి సుబ్బారావు, జనచైతన్య మండలి నాయకుడు నేలపాటి పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కాపవరం సర్పంచ్ జాజుల రాము, టీడీపీ నాయకులు తెలగంశెట్టి శ్రీనివాసు, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ వీరగణేష్ పాల్గొన్నారు.



బెల్ట్ తీస్తారట!

సారా జోరు.. బెల్ట్ షాపుల హుషారు

- నవోదయంలో కాకినాడ వెనుకంజ
- తూర్పు, కోనసీమ ముందంజ
- 600 మద్యం దుకాణాలు
- పలు చోట్ల ఎమ్మార్పీ కంటే ఎక్కువ
- మందుబాబుల బేజారు
- అయినా పట్టని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సారాతో పాటు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాల్లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణ యించింది. గత శుక్రవారం రాష్ట్ర ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సయిజ్ అధికారులతో నవోదయం-2.0, బెల్ట్‌షాపుల పరిస్థితిపై సమీక్షించారు. ఎక్కడా ఒక్క బెల్ట్ షాపు ఉండకూదని ప్రభుత్వం నిర్ణయించి నట్టు ప్రకటించారు. దీంతో అధికారులు ఆరా తీసి కేసులు పెడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు కొవ్వూరు డివిజన్‌లో సుమారు 600 వరకు అధికారిక మద్యం షాపులు ఉన్నాయి. ఆయా షాపుల యజమానులే సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. కొంద రైతే ఆర్గనైజ్డ్‌గా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. నవోదయం 2.0లో భాగంగా ఎక్కడా సారా ,బెల్ట్ షాపులు ఉండకూడదని, నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలని ప్రభుత్వం అధికారుల ను ఆదేశించింది.దీనిలో భాగంగా తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సారాపై ఉక్కుపాదం మోపుతున్నారు. సారా అరికట్టడంలో కాకినాడ జిల్లా వెనుక బడి ఉంది. ఈ నెల 15వ తేదీ లోపు అక్కడ కూడా సారారహితంగా చేయవలసి ఉందని ప్రభుత్వం ఆదేశించింది.ఈ నేపథ్యంలోపూర్తిగా నిర్మూలించాలనే ల క్ష్యంతో ముందుకు వెళుతున్నారు.

ఎక్సయిజ్ అధికారుల దూకుడు



మూడు జిల్లాల ఎక్సయిజ్ అధికారులు దూకుడు పెంచారు. బెల్ట్‌షాపులపై దాడులు ఆరంభించారు. ఏడాదిలోపులో వందలాది బెల్ట్‌షాపులపై కేసులు పెట్టి నట్టు తూర్పుగోదావరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. రాజమండ్రి సౌత్ స్టేషన్ పరిధిలో కేవలం పది రోజుల్లో 8 షాపులపై కేసులు పెట్టి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అధికార మద్యం షాపుల నిర్వాహకుల వాదన వేరేగా ఉంది. తమకు ప్రభుత్వం ఇస్తానని చెప్పిన 20 శాతం కమీషన్ ఇవ్వడంలేదని, కేవలం 13.5 శాతం మాత్రమే ఇస్తుండడంతో నష్టాల్లో మునిగిపోయామనే వాదన వినిపిస్తున్నారు.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మద్యం వ్యాపారాలు ఇటీవల ఒక మీటింగ్ పెట్టి 15 రోజుల్లో తమ సమ స్యలు పరిష్కరించకపోతే తాము షాపులు నిర్వహించలేమని అల్టిమేటం ఇచ్చారు..



బదిలీ భయం...

ఉన్నారా..సార్!

అడకత్తెరలో అబ్కారీ శాఖ

బదిలీ అంటే ఉద్యోగితో పాటు కుటుంబం కదలాల్సి ఉంటుంది.ఈ క్రమంలో పిల్లల చదు వులు, ఇంట్లో వృద్ధులైన, అనారోగ్యంతో ఉన్న కుటుంబీకుల విషయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్సయిజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం ఎస్ఈబీ అంటూ ఓ కొత్త పదాన్ని సృష్టించి దానిలో కలిపేసింది. కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత అబ్కారీ శాఖకు మళ్లీ ఆయువు పోసింది. అప్పటి వరకూ పొరుగు గొడుగులో అంతర్మథనంతో విధులు నెట్టుకొ చ్చిన అధికారులు, సిబ్బంది హమ్మయ్య అనుకున్నారు.కానీ జిల్లా కేంద్రం రాజమహేంద్రవ రం సిటీ, రూరల్‌కి సంబంధించి ఇంకా కుదురు కోలేదు. రాజకీయ నాయకుల ఎత్తుగడల్లో అధి కారులను పావులుగా చేస్తున్నారు. మరో వైపు మద్యం వ్యాపారుల వైరాల్లోకి అబ్కారీ శాఖను లాగుతున్నారు. దీంతో నిఘా వర్గాలు కూపీ లాగడం ఆరంభించాయి. మరో వైపు ఏసీబీ అధికారులు ఓ వ్యాపారి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారని సమాచారం. ఈ క్రమంలో సిటీ, రూరల్‌కి సంబంధిం చిన నార్త్,సౌత్ స్టేషన్ల లో మొత్తం సిబ్బందిని బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావించారు.

- సిబ్బందిపై పొలిటికల్ ఎఫెక్ట్
- ఊహూ అంటే ట్రాన్స్‌ఫర్
- నలిగిపోతున్న అధికారులు
- కుదురుకునే లోపే సీటు కదలిక
- ఆ రెండు స్టేషన్లలో ఇదీ తీరు
- 6 నెలలు తిరగకముందే మళ్లీ
- నేడో,రేపో బదిలీల బంతాట

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అబ్కారీ అధికారులు, సిబ్బంది పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా తయారైంది. కరవమంటే కప్పకు కోపం విడవ మంటే పాముకు కోపం అన్నట్టుగా విధులు ఉండడంతో నెట్టుకురావడం కష్టమవుతోందని అంటున్నారు.రాజకీయ నాయకులు చల్లుకుంటున్న బురద తమ యూనిఫాంకి రాస్తుండడం.. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసు కొని కుర్చీలో కుదుటపడేలోపుగానే బదిలీ అంటూ కదుపుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆ రెండూ స్టేషన్లలో సమస్యలే..

సాధారణంగా ఎవరిపై అయినా ఆరోపణ వస్తే.. అది రుజువు అయితే వారిపై చర్యలకు ఉపక్రమించడం రివాజు. కానీ జిల్లా కేంద్రంలో మాత్రం రెండు స్టేషన్లనూ అతలాకుతలం చేసేస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో కానిస్టేబుల్ దగ్గర నుంచీ సీఐల వరకూ మొత్తం సిబ్బందిని బదిలీ చేశారు. రెండు స్టేషన్లకు రెగ్యులర్ సీఐ, ఎస్ఐలను ఇవ్వలేదు. సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు. సౌత్ స్టేషన్‌కి రెండు నెలల కిందట ఆలమూరు సీఐ ని ఇన్‌చార్జిగా నియమించారు. ఓ ఎస్ఐని తర్వాత ఇచ్చారు. పక్షం కిందట ఆయనను మళ్లీ ఆలమూరు పంపేసి స్టేషను బాధ్యతలు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్‌కి అప్పజెప్పారు. నార్త్ స్టేషనుకు రెగ్యులర్ సీఐ లేరు. ఇప్పటికీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐతోనే అదనపు విధులు నిర్వర్తింపజేస్తున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న రంపచోడవరం ఎస్ఐని ఓ నెల కిందట ఈ స్టేషను విధులు చూడాలని పంపించారు. అధికారులు, సిబ్బంది పరిస్థితి ఇలా అస్తవ్యస్తంగా ఉంది.

మళ్లీ బదిలీనా!



ఇప్పుడు ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ వీళ్లందరినీ బదిలీ చేస్తారని తెలుస్తోంది. నేడో, రేపో ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అధికారులు, సిబ్బంది ఆవేదన చెందుతు న్నారు.ఇలా ఆరోపణలు వస్తే అలా అందరినీ బాధ్యులను చేయ డం ఎంత వరకూ సమంజసమనే ప్రశ్న వినవస్తోంది. బదిలీ ఉత్తర్వుల్లో 'పరిపాలన సౌలభ్యం', 'తర్వాతి ఉత్తర్వులు అందే వరకూ' అని మాత్రమే స్పష్టం చేస్తున్నారు.ఇలా గంప గుత్తగా బదిలీలపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మళ్లీ కొత్తగా వచ్చే అధి కారి సీటులో టవల్ సర్దుకొనేలోపే ఉంటారో వెళ్లిపో తారో తెలియని పరిస్థితి నడుస్తోంది. దీంతో ఎన్ ఫోర్స్‌మెంట్‌పై ప్రతి కూల ప్రభావం పడుతోంది. మరోవైపు అధికా రులకు బెది రిం పు మెసేజ్ పంపే స్థాయికి పలువురు వ్యాపారులు తెగించారు. కోర్టు కేసులూ, వివరణలు ఇచ్చుకోవడం ఉద్యోగులకు నిత్యకృత్యమైపోయింది.ఈ గలాటా తట్టుకోలేక ఇక్కడి నుంచి వెళ్లిపోతామని కొందరు అంటుం టే.. కొత్త వారు రావడానికి ఇష్టపడడం లేదు. మొత్తానికి రాజకీయ నాయకుల చేష్టలు, మద్యం వ్యాపారుల గొడవలు జిల్లాలోని అబ్కారీని రోడ్డుకీడుస్తున్నాయి. నాయకులను, మద్యం వ్యాపా రులను గాడిలో పెట్టకపోతే అబ్కారీలో విధులకు తూర్పు తిరిగి వెతుక్కోవాల్సిందే!.



గృహ నిర్మాణం పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

పీఎంఏవై సర్వే వేగవంతం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం/గోకవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై 2.0 లో భాగంగా 1442 గృహాల సర్వే చేశారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. హౌసింగ్ అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ఈ నెలాఖరికి మొత్తం సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.ఆవాస్ ప్లస్ యాప్ లో ఏర్పడిన సాంకేతిక సమస్యలు పరి ష్కారం కావడంతో సర్వే తిరిగి ప్రారంభ మైందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 15,533 దరఖాస్తులు స్వీకరించగా 657 దరఖాస్తుల సర్వే గతంలోనే చేశామన్నారు. మిగిలిన 14,876 ఇళ్లలో ఇప్పటికే 1442 పూర్తి చేశామన్నారు. గోకవరం మండలం కామరాజుపేటలో జరుగుతున్న పీఎంఏవై సర్వే పనులను శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతీ కుటుం బం పేరు జాబితాలో చేర్చేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమా చారం సేకరిస్తున్నారని తెలిపారు. అన పర్తిలో 225 దరఖాస్తులు రాగా 22 సర్వే పూర్తయిందని, బిక్కవోలులో 345కి 20, చాగల్లులో 320కి 41, దేవరపల్లిలో 1278కి 20,గోకవరంలో 798కి 8, గోపాలపురంలో 1521కి 8, కడియంలో 575కి 6, కోరుకొండలో 1408కి 1, కొవ్వూరులో 299కి49, నల్లజర్లలో 2981కి 15, నిడదవోలులో 641కి 42, పెరవలిలో 666కి 188, రాజమహేంద్రవరం రూరల్‌లో 585కి 76, రాజానగరంలో 1798కి 66, రంగంపేటలో 595కి 22, సీతానగరంలో 761కి 12, తాళ్లపూడిలో 435కి 46 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందన్నారు.

'వాడపల్లి'కి.. ఉచిత బస్సుకై..!





వాడపల్లి వెళ్లి వచ్చే భక్తులతో రద్దీగా ఉన్న రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్

- రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్‌కు భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు
- ఉదయం నుంచి బస్సు కోసం ప్రయత్నం
- రాత్రి వరకు రద్దీగానే ఆర్టీసీ కాంప్లెక్స్

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ నెలకొంది. పైగా, మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కూడా ఉండడంతో వారంతా బస్సులకోసం వేచిచూడాల్సి వచ్చింది. కార్తీకమాస పర్వదినాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులు వాడపల్లి వెళ్లేందుకు ఇక్కడకు తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఉదయంనుంచి రాత్రి వరకూ రద్దీ ఏర్పడింది.

వీడనున్న మిస్టరీ!

- రామచంద్రపురం బాలిక మృతి కేసులో చివరిదశకు దర్యాప్తు
- ప్రాథమిక ఆధారాల ప్రకారం అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు
- ఇప్పటికే పలువురిని ప్రశ్నించిన పోలీసు అధికారులు
- విచారణను స్వయంగా పర్యవేక్షిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా
- వరుసగా రెండురోజులు పోలీస్‌స్టేషన్‌కు రాక.. కేసు పురోగతిపై ఆరా
- నేడు కేసు వివరాలు వెల్లడించే అవకాశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాలిక మృతి మిస్టరీ వీడనుందా.. అంతుచిక్కని వ్యవహారంగా మారిన ఈ కేసు దర్యాప్తు ముగింపు దశకు చేరినట్లు సమాచారం. ఈ కేసు విచారణను ఎస్పీ రాహుల్‌మీనా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీని నిమిత్తం ఇప్పటికే ఆయన రెండుసార్లు రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చారు. కేసు పురోగతిపై స్వయంగా ఆయనే ఆరా తీస్తున్నారు. దర్యాప్తు చివరి దశకు రావడంతో ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఏం జరిగిందంటే..

ఈనెల 4న రామచంద్రపురంలో 5వతరగతి విద్యార్థిని సిర్రా రంజిత(10) అనే బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. బాలిక తల్లి సునీత స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. పట్టణంలోనే త్యాగరాజునగర్‌లోని అద్దెఇంట్లో నివసిస్తున్నారు. సునీత భర్త సిర్రా రాజు ముంబయిలో షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. వీరి పెద్దకుమార్తె నవోదయ పాఠశాలలో చదువుతోంది. చిన్నకుమార్తె రంజిత స్థానిక ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఈనెల 4న సునీత కాకినాడ వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల అనుమానాలు

బాలిక మృతిపై తల్లి సునీత, తండ్రి రాజు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన రోజున ఏరియాఆస్పత్రి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో వారు పలు అంశాలు ప్రస్తావించారు.ముఖ్యంగా ఉరివేసుకునే ఫ్యాన్ రంజితకు అందని స్థితిలో ఉండడం, సమీపంలో ఎత్తుకు ఎటువంటి పరికరాలూ వాడిన దాఖలాలు లేకపోవడం, ఫ్యానుకు ఉరివేసుకున్న చున్నీకి వేసిన ముడులు క్లిష్టంగా ఉండడం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. వీరి ఆరోపణల ఆధారంగా ఇంటి యాజమాని కుమారుడిని పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీల ఆధారంగా మరికొంత మందిని కూడా విచారించినట్లు చెప్తున్నారు. ఎలక్ట్రికల్ పనులు చేసే ఓ యువకుడిని కూడా విచారించినట్లు తెలుస్తోంది.

హత్యా. .ఆత్మహత్యా..

కాగా బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో అనుమానాస్పద మృతిగానే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు రంజిత మృతిపై ప్రాథమిక ఆధారాలతో ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. హత్య కేసుగానే దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. కీలక ఆధారాల సేకరణలో యంత్రాంగం ముమ్మరంగా కృషి చేస్తోంది.

కీలకంగా మారనున్న పోస్టుమార్టం

బాలిక మృతదేహానికి ఈనెల 5న పోస్టుమార్టం నిర్వహించారు. మృతికిగల కారణాలు సాంకేతికంగా తెలుసుకునేందుకుగాను ఫోరెన్సిక్ పరీక్షలకు శాంపిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో సాంకేతిక ఆధారాలు కీలకం కానున్నట్లు తెలుస్తోంది.

వరుసగా రెండురోజులు ఎస్పీ రాక

కాగా, ఈ కేసును జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు అధికారులను కేసు విచారణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక మృతి కావడంతో తాను స్వయంగా వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. శనివారం రాత్రి కూడా ఎస్పీ రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. డీఎస్పీ రఘువీర్ కూడా రామచంద్రపురం స్టేషన్‌లో ఉన్నారు. కేసు మిస్టరీని దాదాపు ఛేదించినట్లు తెలుస్తోంది. ఆదివారం కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉందని సమాచారం.

ఎనిమిదేళ్ల తర్వాత మహిళకు పెద్ద ఖర్మ

- చింతూరు మండలం కల్లేరులో కార్యక్రమం నిర్వహించిన ఐద్వా గ్రామ కమిటీ



జోగమ్మకు సంప్రదాయ పెద్ద ఖర్మను నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆ మహిళ కాలం చేసి ఎనిమిదేళ్లయింది. కొడుకులు పట్టించుకోలేదు. దీంతో ఐద్వా నేతృత్వంలో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిన పెద్ద ఖర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కల్లేరులో శనివారం చోటుచేసుకుంది. 15ఏళ్ల క్రితం సరిహద్దు రాష్ట్రమైన ఒడిస్సాలోని వినాయకపురం నుంచి పండుగ జోగమ్మ కల్లేరు వలస వచ్చింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. ఎనిమిదేళ్ల క్రితం జోగమ్మ మృతి చెందింది. గ్రామస్థులు ఆమెకు దహన సంస్కారాలు తమ సంప్రదాయ పద్ధతిలో చేసేశారు. పెద్ద ఖర్మ చేయడానికి ఆమె వారసత్వం తప్పని సరి. దీనిపై ఆమె కుమారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదు. తమ గ్రామంలో ఒక మహిళకు చివరకు పెద్ద ఖర్మ నిర్వహించకపోలేకపోవడాన్ని గ్రామస్థుల మనస్సు కలచివేసేది. కల్లేరు ఐద్వా గ్రామ కమిటీ పెద్ద ఖర్మ చేసేందుకు ముందుకు వచ్చింది. పెద్దల అనుమతితో కొంతసొమ్ము చందాగా ఇచ్చింది. తదుపరి గ్రామంలోని ప్రతిఇంటికి రూ.200 వంతున, 2కిలోల బియ్యం చందా రూపంలో జమ చేసింది. జోగమ్మ నివసించిన స్థలంలో చిన్న ఇల్లును కూడా ఏర్పాటు చేశారు. జోగమ్మ కుమారులకు సమాచారం ఇవ్వడంతో వారు చుట్టపుచూపుగా కార్యక్రమానికి వచ్చారు. ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు ముర్రం రంగమ్మ, చిన్నమ్మ, సోయం రమాదేవి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సామర్లకోటలో భీమేశ్వరుడికి ఆకాశదీప పూజలు

సామర్లకోట,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీకమాస మహాపర్వదినాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంవద్ద పండితులు ఆకాశదీప పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు.





సామర్లకోట భీమేశ్వరాలయంలో ఆకాశదీప పూజలు, జ్యోతిర్లింగార్చన పూజలు చేస్తున్న దృశ్యం

బండెనక బండి కట్టి..!



బండెనక బండి కట్టి.. 16 బళ్లు కట్టి అన్నట్టుగా వరుసగా వెళ్తున్న ఈ ఎడ్ల బండ్లు పిఠాపురం జాతీయ రహదారిపై శనివారం కనిపించాయి. ధాన్యం తోలకాలకు ఒకదాని వెనుక ఒకటి ఇలా వెళ్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

ఫొటో: ఆంధ్రజ్యోతి-కాకినాడ స్టాఫ్‌గ్రాఫర్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- 14, 15వ తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు-2025
- పారిశ్రామికసంస్థలు, పారిశ్రామికవేత్తలు హాజరుకావాలి



ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన భాగస్వామ్య సదస్సు బేనర్

సర్పవరంజంక్షన్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 14-15వ తేదీల్లో రెండురోజులపాటు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ భాగస్వామ్య సదస్సు-2025లో ఉమ్మడి జిల్లాల నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు తరలివెళ్లేలా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కృషిచేస్తున్నారు. పారిశ్రామిక సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలు, పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలకల్పన, స్థానిక పరిశ్రమల నిర్వాహకులతో కలసి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనాసంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో మెరుగైన మౌళిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నిర్మూలన కోసం విస్తృతంగా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. ఈమేరకు ఈనెల 10న ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ మండలం వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలో రూ.1.79కోట్ల ఐఏఎల్ఏ వాకలపూడి నిధులతో రోడ్లు, మౌళికసదుపాయాల కల్పన, మరమ్మతులు, వీధిదీపా లు, ఎస్‌వీ దీపాలు, ఫీడర్‌పిల్లర్ తదితర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేసేందుకు ఏపీఐఐసీ ఏర్పాట్లు చేస్తోంది. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కాలుష్య నిర్మూలన కోసం గ్రీన్‌బెల్ట్ పచ్చదనంకోసం విస్తృతంగా మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకున్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుకి తరలిరావాలి

ఏపీఐఐసీ కాకినాడజోన్‌పరిధిలో గల పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ యాజమా న్యాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్ బృందాలు, జోన్ పరిధిలో ఉన్న 11పారిశ్రామిక ప్రాంత ప్రాధికార సంస్థలు (ఐఏఎల్ఏ)లో సొసైటీ సభ్యులు తరలి రావాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కోరారు. ఈనెల 14-15వ తేదీల్లో విశాఖ ఏయూలో జరిగే సదస్సులో పాల్గొనే వారు http:\\partnershhipsummit.ap.gov.in ఆన్‌లైన్ లింక్‌లో తమ పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగస్వామ్యసదస్సు ప్రధాన ఉద్దేశం పరిశ్రమల అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికవృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను పెంచేందుకు , భవిష్యత్తు వ్యూహాలను ఈ భాగస్వామ్య సదస్సు ద్వారా నిర్ణయించడం జరుగుతు ందన్నారు. ఉమ్మడిజిల్లా నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు.

వైసీపీ పాలనలో పీఏసీఎస్, డీసీసీబీ వ్యవస్థలు నిర్వీర్యం

- పీఏసీఎస్, డీసీసీబీలను బలోపేతం చేస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు



కూర్మాపురంలో శతాబ్ది భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


రాయవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పీఏసీఎస్‌లు, డీసీసీబీ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సాయంత్ర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కూర్మాపురం సహకార సంఘం ఏర్పడి 105 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సహకార సంఘం శతాబ్ది భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి(కూర్మాపురం అబ్బు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో చాలా సహకార సంఘాలు వెనుకబడి, డీసీసీబీలు అప్పుల్లో ఉండటానికి కారణం ఐదు సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్‌చేసి నచ్చిన వారికి నచ్చినట్లు పరపతి సం ఘాలు, డీసీసీబీలను అప్పజెప్పి పూర్తిగా అవినీతిమయం చేసి వేల కో ట్ల రూపాయలను ఐదు సంవత్సరాలపాటు దోచుకుని వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చాలామంది ఎమ్మెల్యేలు తన దగ్గరకు వచ్చి గత ప్రభుత్వ పాలనలో తమ నియోజకవర్గాల్లో పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో దారుణాలు జరిగాయని ప్రజల సొమ్ము అప్పనంగా దోచేశారని చెప్పారన్నారు. దీనిపై అసెం బ్లీలో ఒకరోజు అంతా చర్చ జరిగిందని, ప్రతి సంఘం మీద ఎంక్వయిరీ చేయడం ఒక ఎత్తు అయితే డీసీసీబీల పరపతి సంఘాల మీద ఒక శాసనసభా కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. ఈదేశంలో సొసైటీలు, డీసీసీబీలు కంప్యూటరైజ్డ్ చేయాలని లోన్లు ఎంతమంది తీసు కున్నారు, ఎంత కడుతున్నారు తెలుసుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ సహకార సంఘాలు, డీసీసీబీలు కంప్యూటరైజ్డ్ చేయాలని నిర్ణయించారన్నారు. అనేక ఒత్తిడిలు వచ్చినప్పటికీ ఆంధ్ర రాష్ట్రంలో పీఏసీఎస్‌లు, డీసీసీబీలు నూటికి నూరుశాతం తాము తమ ప్రభుత్వం కంప్యూటరైజ్డ్ చేశామన్నారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌లను కూటమి ప్రభుత్వం బలోపేతం చేయడంతోపాటు పీఏసీఎలకు ధాన్యం కొనుగోలు, ఎరువులు, విత్తనాలు అమ్మకాలు సాగించడం ద్వారా బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. తుఫాను తరువాత పంటలన్నీ నేలవాలాయని, పంట చేతికి వచ్చే సమయంలో రైతుకు చాలా నష్టం జరిగిందని, రైతు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగాన్ని రైతుల దగ్గరకు పంపించి వాస్తవాలను నమోదు చేయాలని సూచించామన్నారు. ఆర్టికల్చర్, వరి పంటనష్టంపై ఈనెల 7న వచ్చిన రిపోర్టుపై ఒక అంచనాకు వచ్చామన్నారు. పంట నష్టం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుకు 17వేలు సరిపోదని ఇటీవల విజయవాడ వరదలు వచ్చిన సమంలో ఒక జీవో ఇచ్చి వరి పంట నష్టపోతే హెక్టార్‌కు 17వేల రూపాయల నుంచి 25వేలకు పెంచామని, అరటికి 35వేలకు పెంచి రైతుకు నష్టం లేకుండా పరిహారం అందజేస్తామన్నారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడిని మాజీ ఎమ్మెల్సీ చౌదరి, ఆయన సతీమణి సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ వట్టికూటి సూర్యకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, డీసీసీబీ చైర్మన్ రామస్వామి, డీసీఎంఎస్ చైర్మన్ చంద్రమౌళి సర్పంచ్ చౌటపల్లి చక్రవేణి, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, సహకారసంఘం అధ్యక్షురాలు సూర్యకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అసోంకు సామర్లకోట నుంచి బియ్యం ఎగుమతులు

- రైల్వేకు రూ.70 లక్షల ఆదాయం

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట రైల్వేగూడ్స్ యార్డు నుంచి 2,400 మెట్రిక్ టన్నుల పరిమాణం గల పచ్చిబియ్యం ఎగుమతులను శనివారం తెల్లవారుజాము వరకూ ప్రత్యేక గూడ్స్‌రైలు ద్వారా ఎగుమతులు చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రెండు ప్రముఖ రైస్‌మిల్లులకు చెందిన ఈ బియ్యం ఎగుమతులకోసం 42 వ్యాగన్లు వినియోగించారు. సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు నుంచి అసోంనకు ఎగుమతులు చేస్తున్న పచ్చిబియ్యం రవాణా ద్వారా సామర్లకోట రైల్వేస్టేషన్‌కు రవాణా చార్జీలుగా రూ.70 లక్షల ఆదాయం సమకూరడవేగాక 100 లారీలకు, 20ట్రాక్టర్లకు ఎగుమతులు, దిగుమతుల ద్వారా రూ.15లక్షలు, 100 మంది హమాలీ కూలీలకు రూ. 4.50లక్షల మేర ఉపాధి లభించింది. రానున్న 20 రోజులలో మరో 10వేల మెట్రిక్‌టన్నుల మేర పచ్చిబియ్యం అస్సోం రాష్ట్రానికి ఎగుమతులు సామర్లకోట నుంచే రవాణా చేసేందుకు రైల్వే ఉన్న తాధికారులతో అంగీకారం కుదిరింది.







ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.67.35లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరుమాడవీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భకులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.35 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలితిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 9వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.3,60,330 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో జనసందోహం

- శనివారం ఒక్కరోజు 7907 వ్రతాలు
- రూ.70 లక్షల ఆదాయం



సత్యదేవుడి దర్శనంకోసం బారులుతీరిన భక్తులు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధి శనివారం భక్తజనసందోహంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతా లు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులు అధికసమయం క్యూలైన్లలో అవస్థలు ఎదుర్కొన్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం పట్టింది. రద్దీదృష్ట్యా అంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేశారు. 2000 వ్రతమండపంలో భక్తులు నిరీక్షణ అధికమవ్వడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్రతమండపాల ఖాళీనిబట్టి టిక్కెట్లు జారీ చేయాలని అన్నారు. 1500 అదనపు వ్రతమండపాలు ఏర్పాటుచేసినా భక్తుల సెంటిమెంట్‌కు వ్యతిరేకత రావడంతో వాటిలో నిర్వహించడం మానేశారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్‌వద్ద నుంచి పర్యవేక్షించారు. ఒకదశలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న మెట్ల మార్గాన్ని మూసివేసి రద్దీ అనంతరం తెరిచారు. ఈవో సుబ్బారావు కమాండ్ కంట్రోల్‌రూం, వ్రతమండపాలను పరిశీలించారు. శనివారం ఒక్కరోజు 7907వ్రతాలు, సుమారు రూ.70లక్షల ఆదాయం సమకూరింది.

వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి,అమ్మవార్లను ప్రదక్షిణ గావించారు.

రేపు కాకినాడ వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడసిటీ, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): హెచ్‌సీఎల్ (స్మార్ట్ బ్రెయిన్స్) కంపెనీలో ఉద్యోగాలకు ఈనెల 10న కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంవద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ కంపెనీలో నెట్‌వర్క్ ఇంజనీర్, డెస్క్‌టాప్ ఇంజనీర్, ఎల్1 స పోర్ట్, డేటా సెంటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు బీటెక్ (ఆల్‌స్ట్రీమ్స్), బీసీఏ, ఎంసీఏ 2019 నుంచి 2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎడ్యుకేషన్‌లో ఒక సంవత్సరం అంతరాయం ఉన్నా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆరు నెలల ట్రైనింగ్‌లో ఏడాది ప్రాతిపదికన రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు జీతం, ట్రైనింగ్ అనంతరం రూ 3.5 లక్షల నుంచి రూ 3.8 లక్షల జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376222లో సంప్రదించాలన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు!

- టైరు పేలి బీభత్సం సృష్టించిన పెళ్లికారు
- రెప్పపాటులో ముగ్గురు బలి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తొట్టిరిక్షా తోస్తున్న తాత, మనవడి మృతి
- బొప్పాయిలు విక్రయించే మరొకరు..
- సోమవరం బస్టాప్ వద్ద ఘటన




ప్రమాదంలో పాడైన మోటారుసైకిళ్లు



ఓదార్చుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కిర్లంపూడి/ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు సామాన్యులు.. కాయకష్టం చేసుకుంటేనే వారి జీవితం ముందుకు వెళ్తుంది. వారిపైకి ఓ పెళ్లికారు మృత్యురూపంలో దూసుకొచ్చింది. అతివేగం, నిర్లక్ష్యం.. దానికి తోడు ఒక్కసారిగా టైరు పంక్చర్ కావడంతో పెళ్లి కారు బీభత్సం సృష్టించింది. రెప్పపాటులో ముగ్గురిని బలితీసుకుంది. మరో ముగ్గురిని తీవ్రంగా గాయపరిచింది. దీంతో ప్రశాంతంగా ఉన్న అక్కడి వాతావరణం రోదనలతో మిన్నంటింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం జాతీయ రహదారిపై ఉన్న రిక్వెస్ట్ బస్టాప్ వద్ద శనివారం ఉదయం భీతావహ పరిస్థితి నెలకొంది. అన్నవరం నుంచి జగ్గంపేట వైపు ఓ పెళ్లికారు ఐదుగురితో కలిసి వెళ్తోంది. అతివేగం, నిర్లక్ష్యంగా వస్తుండగా సోమవరం బస్టాప్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ముందు టైరు పంక్చర్ కావడంతో అక్కడే ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్టాప్ వద్ద కాలేజీకి వెళ్లేందుకు విద్యార్థులు, స్థానికులు వేచిఉన్నారు. కారు అదుపుతప్పి మోటారుసైకిళ్లు, తొట్టిరిక్షా, విద్యార్థులు, స్థానికులను ఢీకొట్టింది. మోటారుసైకిల్‌పై బొప్పాయిలు అమ్ముకునేందుకు వచ్చిన ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45), తొట్టిరిక్షా తోసుకుంటున్న తాతామనవళ్లు మోర్తా ఆనందరావు (65), మోర్తా కొండయ్య (30) మృతిచెందారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకకి చెందిన ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు చీపురుపల్లి ఫణిశ్రీ, కొండ్రాపు చైతన్య, సోమవరానికి చెందిన మరో వ్యక్తి బత్తిన భద్రం తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

శ్రామికులే మృత్యువాత

ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రి ఆవరమంతా మృతుల కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది. బొప్పాయి కాయల వ్యాపారి అయిన ఏలేశ్వరంలోని 11వ వార్డు పెద్ద వీధికి చెందిన కాకాడ రాజు మోపెడ్‌పై సోమవరం వెళ్లి బస్టాప్ వద్ద మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. కాయకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అతడు లేడనే వార్తను ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. అతడికి ఆరుగురు సంతానం కావడంతో కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబానికి జీవనాధారం అయిన మోర్తా ఆనందరావు మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూనే జీవనం సాగించే మోర్తా కొండయ్య కూడా మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అతడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ముగ్గురు చిన్నపిల్లలు కావడంతో తమకు దిక్కెవరని, తాము రోడ్డు మీద పడ్డామని వారు రోదిస్తున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్‌ఐ టి.రఘునాథరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును ఎక్స్‌కవేటర్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంటనే సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతులకుటుంబీకులతో మాట్లాడి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించేలా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. తీవ్రగాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఫోన్‌లో కాకినాడ జీజీహెచ్ వైద్యులకు సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. రెండు మృతదేహాలకు ప్రత్తిపాడు సీహెచ్‌సీలో, ఒక మృతదేహానికి జగ్గంపేట సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేశారు. ఆసుపత్రుల వద్ద మృతుల బంధువుల రోదనలు స్థానికుల కంటకన్నీరు పెట్టించింది. దీనిపై ఎస్‌ఐ రఘునాథరావు కేసు నమోదు చేయగా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద ఘటనను ఎమ్మెల్యే నెహ్రూ సీఎంకు వివరించగా వెంటనే మృతుల కుటుంబీకులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందించాలని సూచించడంతో ఆయన సీహెచ్‌సీలకు వెళ్లి అందజేశారు. బాధిత కుటుంబాలను వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్నాల కోట శ్రీను పరామర్శించారు.

ఇద్దరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న దుర్గచైతన్య

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు క్షతగాత్రులు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం సోమవరంలో బస్టాప్‌లో నిలబడి ఉండగా అదుపుతప్పిన కారు అక్కడ ఉన్నవారిపై నుంచి వెళ్లడంతో ఘటనాస్థలిలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు విద్యార్థినులు, ఒక పురుషుడు గాయపడ్డారు. వారిలో దుర్గచైతన్య, భద్రం పరిస్థితి విషమంగా ఉన్నట్టు అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.

ఓ శుభకార్యానికి హాజరై వస్తుండగా..

- బుల్లెట్‌తో గోడను ఢీకొట్టిన ముగ్గురు వ్యక్తులు
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



వరప్రసాద్ (పాతచిత్రం)

పి.గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువు వారిపైకి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ విషాద ఘటన పి.గన్నవరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..... కపిలేశ్వరపురం మండలం పల్లపులంకకి చెందిన మోరంపూడి వర ప్రసాద్ (28), బురుగు నాగేంద్ర (28), మల్లిడి విజయ్(26) తమ బుల్లెట్ వాహనంపై పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై కె.ఏనుగుపల్లి ఏటిగట్టు రోడ్డున ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్న వరం శివారు పల్లేరువారిపేట సమీపంలోకి వచ్చేసరికి రహదారి చెంతనే ఉన్న ఒక ఇంటి గోడను బలంగా ఢీకొట్టారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వరప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 సాయంతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు వరప్రసాద్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. చికిత్స పొందుతున్న విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని మెరకవీధి గోదావరిమాత విగ్రహం వద్ద సీతారామ స్నానఘట్టం సమీపంలోని చర్చి పక్కన గోదావరి నదిలో మగ మృతదేహం బోర్లాపడి ఉందని స్థానికులు పోలీసులకు శనివారం సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించారు. మృతదేహం పూర్తిగా డీకంపోజ్ అయిపోయి ఉంది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్, 9440796622 నెంబర్‌కు సమాచారం అందజేయాలని సీఐ పి.విశ్వం తెలిపారు.

నమ్మించి.. చంపేశారు!

- శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు జీకే గ్రాండ్ అధినేత, మాజీ రౌడీషీటర్ కాసుబాబు
- పాతకక్షలు, సోషల్‌మీడియా ఆడియోతో ప్రతిష్ట దెబ్బతిందని హత్యకు పథకం
- మరో ఏడుగురు నిందితులు అరెస్టు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



విలేఖరులకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంచలనంగా మారిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు సహా 8 మందిని అరెస్టు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శనివారం జరిగిన విలేకరుల సమావేశం వెల్లడించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించి బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా పనిచేసిన అమలాపురం పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్న మీడియా సమావేశంలో ఎస్పీ కంచిపల్లి శ్రీను హత్య కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37)కు అమలాపురం పట్టణానికి చెందిన జీకే గ్రాండ్ అధినేత గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు) మధ్య ఆర్థికపరమైన లావాదేవీల తో వైషమ్యాలు తలెత్తాయి. కాసుబాబుపై గతం లో రౌడీషీట్ ఉంది. ఈ క్రమంలో కాసుబాబును కంచిపల్లి శ్రీనివాస్ దూషించినట్టు సోషల్ మీడియాలో ఆడియోలు వైరల్ అయ్యాయి. అప్పటికే అప్పులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కాసుబాబు ఈ ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో తన ప్రతిష్ట దెబ్బతిన్నట్టుగా భావించి ఉనికి చాటుకోవాలని, ప్రజల్లో భయాన్ని కలిగించాలనే ఉద్దేశంతో కంచిపల్లి శ్రీనవాస్‌పై అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ గత నెల 25న తన భార్యకు రాజమహేంద్రవరం వెళుతున్నానని ఫోన్‌లో చెప్పాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గత నెల 27న శ్రీనివాస్ కిడ్నాప్‌కు గురయ్యాడని, పలువురిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పట్టణ పోలీసులు కంచిపల్లి శ్రీను అదృశ్యానికి సంబంధించి కేసును నమోదుచేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. శ్రీనివాస్ ఆరోజున చివరిసారిగా అమలాపురం పట్టణం ఏఎంజీ కాలనీవీధికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతో తిరుగుతున్నట్టు కొందరు సాక్షులు గుర్తించారు. దీంతో పోలీసులు విచారణ జరపగా చిక్కుముడి వీడింది. ఆడియోలు వైరల్ అయిన నేపథ్యంలో కాసుబాబు, అడబాల శంకర్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని కుట్ర పన్నారు. ఈ పనిని సలాది రాంబాబుతోపాటు భాస్కర్ల దుర్గానాగప్రసాద్‌కు అప్పగించారు. 25వ తేదీ రాత్రి వీరు పలుచోట్ల మద్యంకొనుగోలు చేశారు. రాత్రి 11 గంటల సమయంలో కంచిపల్లి శ్రీనును కారులో తీసుకువెళ్లి అంబాజీపేట మండలం వక్కలంక గ్రామం దగ్గర మద్యం సేవించారు. ఆ తరువాత సలాది రాంబాబు, భాస్కర్ల దుర్గానాగప్రసాద్ కత్తితో శ్రీనివాస్‌పై దాడిచేసి హత్యచేశారు. మత్యదేహాన్ని కారు వెనుక సీటులోవేసి ఆ దృశ్యాలను వీడియో కాల్ ద్వారా ప్రధాన నిందితుడిగా పేర్కొనబడ్డ గంగుమళ్ల కాసుబాబుకు చూపించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని పి.గన్నవరం మండల పరిధిలోని వైనతేయ నదిలో గోదావరిలో పడేశారు. ఆ మృతదేహం గతనెల29న మధ్యాహ్నం 1 గంటకు పి.గన్నవరం మండల ఆర్.ఏనుగుపల్లిలో మృతదేహాన్ని వెలికితీసి తరువాత శ్రీనివాస్ శరీరంపై గాయాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు.

నిందితుల వివరాలు ఇలా..

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అమలాపురం పట్టణానికి చెందిన గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు)తో పాటు హత్య చేసిన, సహకరించిన ఈదరపల్లికి చెందిన అడబాల శంకర్‌బంగారు, పట్టణంలోని ఏఎంజీ కాలనీకి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, మార్కెట్‌వీధికి చెందిన భాస్కర్ల దుర్గానాగప్రసాద్, అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన కరాటం నరేష్, రాజోలు మండలం వేగివారిపాలెంకు చెందిన యర్రంశెట్టి లింగయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా దొమ్మగూడెంనాగారంకు చెందిన మోరం సత్యగంగామాణిక్యాలరావు అలియాస్ సతీష్, అదే ప్రాంతానికి చెందిన మోరం వీరవెంకటసత్యశ్రీనివాస్‌లను ఈ కేసులో నిందితులుగా అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, సుజుకి యాక్సిస్ స్కూటర్, హత్యకు వాడిన కత్తి ఒకటి, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పెంటపాటి అనిల్ అనే మరో వ్యక్తి దొరకాల్సి ఉందని తెలిపారు. ఈ కేసులో హత్యకు గురైన శ్రీనివాస్‌ను కిరాతకంగా చంపారని వస్తున్న వార్తలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఎస్పీ బదులిచ్చారు. హత్యకు గురైన శ్రీనివాస్ నాలుక కోయలేదు. కళ్లు పీకలేదు. శిరోముండనం చేయలేదని స్పష్టంచేశారు. నాలుగు రోజుల పాటు మృతదేహం నీటిలో ఉండడం వల్ల ఒంటిపై ఉన్న వెంట్రుకలు ఊడిపోయాయని తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించడంలో కీలకంగాపనిచేసిన పట్టణ సీఐ వీరబాబు, ఇతర సిబ్బందిని ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి

సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల కోసం తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 12, 13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వివిధ వేదికల్లో జరుగుతాయని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ నెల 12న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అదే రోజు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, ఫుట్‌బాల్, యోగా, ఫ్యాట్ టు ఫిట్ జిమ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. దానవాయిపేట ప్రాంగణంలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు.13న హుకుంపేటలోని బొప్పన అకాడమీలో బ్యాడ్మింటన్, చరణ్ కార్తీక్ టీటీ అకాడమీ (ఏవీ అప్పారావు రోడ్డు)లో టేబుల్ టెన్నిస్, ఎస్‌కేవీటీ కళాశాలలో స్విమ్మింగ్, హాకీ, లాన్ టెన్నిస్, రెజ్లింగ్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్ ప్లే విభాగాల్లో కూడా ఎంపికలు జరుగుతాయని పురుషులు, మహిళలకు (ఓపెన్ కేటగిరీ- నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులు) పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో జరుగుతాయని, క్రీడాపోటీల్లో పాల్గొనదలచినవారికి ఎలాంటి టీఏ, డీఏ ఇవ్వబడదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 90329 34038లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మరణించింది. కొత్తపల్లి మండలం కాశీవారిపాకలకు చెందిన వాసంశెట్టి చంద్రమ్మ(72) తన మనవడితో కలిసి శనివారం పట్టణంలోని ఓ ఆసుపత్రికి వచ్చింది. చికిత్స అనంతరం బైక్‌పై ఇంటికి వెళుతుండగా జారిపడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించగా మరణించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..

చోరీల బాట

- ఐదుగురు వాహన దొంగలు అరెస్ట్
- రూ. 60 లక్షల విలువైన ఆటోలు, మోటారుసైకిళ్లు స్వాధీనం
- కాకినాడ ఎస్పీ బిందుమాధవ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారు ఎనమండుగురు స్నేహితులు. ఎవరికి వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటోలు నడుపుతూ వారి రెక్కల కష్టంతో జీవనం సాగిస్తుంటారు. అయితే వీరికి పాత నేరస్థుడైన ఆటో డ్రైవర్ స్నేహితుడు కావడంతో అతను వారందరిలో కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనను నూరి పోసాడు. అప్పటి నుంచి వారందరు కలిసి కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, అనకాపల్లి, పశ్చిమగోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా నేరాలు చేస్తూ చివరికి కాకినాడ పోలీసులకు చిక్కారు.వారి నుంచి రూ.48 లక్షల విలువ చేసే 18 ఆటోలు, రూ.12 లక్షల విలువ చేసే 22 మోటారుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ నిందితుల వివరాలను వెల్లడించారు. శుక్రవారం రాత్రి పిఠాపురం మండలం విరవాడ గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు 8 మంది అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని ఆపే క్రమంలో ముగ్గురు వ్యక్తులు తప్పించుకోగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడు, పాత నేరస్థుడైన కాకినాడ రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్ కాలనీకి చెందిన పెమ్మాడి ఆశీర్వాదం, శివకృష్ణ కాలనీకి చెందిన పెందుర్తి లోవరాజు, కాకినాడ గోలీలపేటకు చెందిన కొల్లి దుర్గాప్రసాద్ అలియాస్ కిమ్స్, కరప మండలం బావారం గ్రామానికి చెందిన కాల కృష్ణఅర్జున్, కాకినాడ జగన్నాథపురం, ముత్తానగర్‌కు చెందిన కనుమూరి గణేష్‌లుగా వారిని గుర్తించారు. పరారీ ఉన్న వారిలో కాకినాడ ఏటిమొగకు చెందిన పెమ్మాడి వీరబాబు, స్థానిక జగన్నాథపురానికి చెందిన తోట శివ, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పితాని దుర్గ ఉన్నారని ఎస్పీ మాధవ్ తెలిపారు. వీరు ఇళ్ల వద్ద పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారన్నారు. ముఖ్యంగా హ్యాండిల్ లాక్ వేయని ఆటోలను తాడు సహాయంతో ఇంజన్ వెనుకభాగం నుంచి స్టార్ట్ చేసి దొంగిలించేవారు. మోటారుసైకిళ్లను మారు తాళాలతో తెరిచి తస్కరించే వారు. కాకినాడ జిల్లాలో 5 ఆటోలు, 11 మోటారుసైకిళ్లు, కోనసీమ జిల్లాలో 2 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఆటో, రెండు మోటారుసైకిళ్లు, అనకాపల్లి జిల్లాలో 9 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, ఏలూరు జిల్లాలో రెండు మోటారుసైకిళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక ఆటో, ఒక మోటారుసైకిల్ వెరసి 18 ఆటోలు, 22 మోటారుసైకిళ్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఈ కేసులు ఛేదించడంలో కృషి చేసిన క్రైం ఎస్‌ఐ బి.వినయప్రతాప్, టౌన్ ఎస్‌ఐ వి.మణికుమార్, క్రైం ఏఎస్‌ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీ గొప్పు చిన్న తదితర సిబ్బందిని ఎస్పీ అభినంధించారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, పిఠాపురం టౌన్ సీఐ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటోలు, మోటారుసైకిళ్లు

పోటాపోటీగా జూడో చాంపియన్‌షిప్



జూడో విజేతలకు మెడల్స్ అందించిన కైకలూరు సీఐ రవికుమార్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికలకు పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో రెండో రోజైన శనివారం కొనసాగాయి.

విజేతలు వీరే..

బాలికలు.. 36 కిలోల విభాగంలో.. నందిని(అనంతపురం), చాందిని(విశాఖ), ఐశ్వర్య(తూర్పు), అఖిలాండేశ్వరి విజేతలుగా నిలిచారు. 40 కిలోల విభాగంలో.. యస్వంత(అనంతపురం), గీతిక(చిత్తూరు), జ్యోతి(తూర్పుగోదావరి), జ్ఞానశృతి(కర్నూలు), 44 కిలోల విభాగంలో జాహ్నవి(అనంతపురం), శైలజ(చిత్తూరు), అరుణకాంతం(తూర్పు), స్నేహలత(కృష్ణ) విజేతలుగా నిలిచారు. 70 కిలోల విభాగంలో అమూల్య(గుంటూరు), శృతికీర్తన(కర్నూలు), మధులత(చిత్తూరు), నందిని(అనంతపురం), 90 కిలోల విభాగంలో అన్నపూర్ణ(చిత్తూరు), పూజ(అనంతపురం), దీవెన(తూర్పు), జాహ్నవి(విశాఖ) విజేతలుగా నిలిచారు.

బాలురు.. 45 కిలోల విభాగంలోయశ్వంత్(అనంతపురం), హిమతే(కర్నూలు), స్వర్జన్(తూర్పు), చరణ్(నెల్లూరు), 40 కిలోల విభాగంలో కార్తిక(అనంతపురం), పాల్(కర్నూల్), లిఖిత్‌కుమార్(కృష్ణ), ప్రసాద్(గుంటూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథులుగా హాజరైన కైకలూరు సీఐ రవికుమార్, ఎస్‌ఐ రాంబాబు చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

ముగిసిన స్క్వాష్ చాంపియన్‌షిప్

కాకినాడలో జరుగుతున్న అంతర్‌జిల్లాల ఏసీఎఫ్ స్క్వాష్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14 బాలురు విభాగంలో ప్రభుకిరణ్(తూర్పు), రమణ(తూర్పు), కార్తికేయ(తూర్పు), హరణ్య(తూర్పు), శశాంత్‌రెడ్డి(చిత్తూరు), వివేకానంద(గుంటూరు), ప్రేమ్‌సాయి(చిత్తూరు), అండర్-17 విభాగంలో తహప్రజ్(తూర్పు), సూరజ్(తూర్పు), అండర్-19 విభాగంలో అఖిల్(తూర్పు), సౌర్య(తూర్పు), బాలికల అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన బ్లెస్సీ, మహాలక్ష్మి, మేఘన, కీర్తన, అండర్-17 విభాగంలో అబిజ్ఞ, ఐశ్వర్య, రూపశ్రీ, తేజస్విని, వేణు అండర్-19 విభాగంలో రూపశ్రీ, వెన్నెల, శ్రేయసుహాషిత, దేవి తదితరులు విజేతలుగా నిలిచారు. డీఎస్‌ఈవో సతీష్‌కుమార్, ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, బి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అబ్జర్వర్‌గా ఎస్కే బాబు వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏసీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, కె.శ్రీనివాసరావు, జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి మాచరరావు, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు బంగారాజు, లంకా జార్జి, వి.రవిరాజు పరుశరాం, మంగయమ్మ, నాగమణి, దీప్తి, ఎస్తేర్, సూరిబాబు, మూర్తి పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో గంజాయి విక్రయాలు

- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు
- రాజోలు సీఐ నరేష్‌కుమార్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయిని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో గంజాయి నిందితుల రీవిజిట్ ప్రోగ్రాంలో భాగంగా పాత నేరస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్న క్రమంలో ఈ నెల 7న గంజాయి విక్రయంపై సమాచారం అందింది. మండల కేంద్రం రాజోలులోని ఒక ఇంట్లో మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన బి.విశాల్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. గూడపల్లికి చెందిన విశాల్, పడమటిపాలెం గ్రామానికి చెందిన డి.లక్ష్మీనాగనరసింహారావు, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఎం.సూర్యకిరణ్, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం దొడ్డనపూడికి చెందిన ఎస్.లక్ష్మీమురళీధర్, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన సీహెచ్ రవితేజ, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలేనికి చెందిన టి.జాన్‌సుభాకర్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.నిందితులను విచారించగా విశాల్ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అక్కౌంట్ క్రియేట్ చేసి అందులో కొందరు యువకుల ను ఫ్రెండ్స్‌గా చేర్చుకుని తనకు పరిచయం ఉన్న గూడపల్లి పంచాయతీ పల్లిపాలేనికి చెందిన ఎం.నాగేంద్ర వర్మ వద్ద నుంచి గంజాయి కొని తెచ్చి గ్రూపులో ఉన్న వారందరికీ అమ్ముతూ ఆ డబ్బును చెడు వ్యసనాలకు బానిపై విలాసాలకు ఉపయోగించుకుంటున్నాడు. గంజాయి అక్రమ రవాణాను నివారించడంలో భాగంగా ఆపరేషన్ సేవ్ క్యాంపస్ అని స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేసి డగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. గంజాయికి సంబంధించి హాట్‌స్పాట్ ఏరియాలను కూడా గుర్తించామని తెనిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్ లిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు తెలియజేయాలని కోరారు. కాగా నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పాపికొండలకు 500 మంది పర్యాటకులు

వీఆర్‌పురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాపికొండలు, పేరంటాలపల్లికి శనివారం 500 మంది పర్యాటకులు రావడంతో 9 బోట్లల్లో పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. ఇటీవల మొంథా తుఫాన్ అనంతరం ఈ నెల 2వ తేదీ నుంచి పర్యాటకం ప్రారంభించారు. శనివారం సెలవు దినం కావడంతో పోచవరం ఫెర్రి పాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ కాస్తా ఎక్కువగానే ఉంది. ముందుగా పర్యాటక బోట్లల్లో పేరంటాలపల్లి చేరుకొని అక్కడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ ప్రాంత కొండరెడ్లు వెదురుతో తయారు చేసిన పలు రకాల వస్తువులు, అందమైన అల్లికలను కొలుగోలు చేశారు. తర్వాత విహారయాత్ర బోట్లపై పాపికొండలు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదించి తిరుగు ప్రయాణం సాగించారు.

చేయూత ఆధ్వర్యంలో సేవా పురస్కారాల ప్రదానం



మంత్రి సుభాష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న రాజు, ప్రభాకర్, పవన్‌కుమార్

కడియం/రాజానగరం/గోకవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడియం గ్రామానికి చెందిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, సేవా కార్యక్రమాలు చేసే చిలుకూరి ప్రభాకర్‌కు ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. శనివారం కాకినాడలోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్, పరుచూరి అశోక్‌బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం చేతులమీదుగా ప్రభాకర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని అభినందించారు. ఇదే కార్యక్రమంలో రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బి.పవన్‌కుమార్, గోకవరం మండలం రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పెదిరెడ్ల రాజులను ను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.రవి కుమార్, కార్యదర్శి అలీం పాల్గొన్నారు.

నేడు సీపీ బ్రౌన్ స్మారక పురస్కారాల ప్రదానం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):తొలి తెలుగు ఇంగ్లీషు నిఘంటువు రూపకర్త సీపీ బ్రౌన్ 227వ జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం గోకవరం బస్టాండ్ సమీపంలోని ఎస్పీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో విశ్రాంత తెలుగు శాఖాధిపతి అరిపిరాల నారాయణరావుకు సీపీ బ్రౌన్ స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్టు రాకా సంస్థ కార్యదర్శి జీవీ రమణ శనివారం తెలిపారు. అలాగే సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడుకు సీపీ బ్రౌన్ స్మారక సాహిత్య పురస్కారం అందజేయనున్నట్టు సన్నిధానం శాస్త్రిపేర్కొన్నారు.

ఘనంగా గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

గోకవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంకష్ట హర చతుర్థి పర్వదినం సందర్భంగా గోకవరంలోని సీఎండీ లేఅవుట్‌లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా గణపతి హోమం నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు బాగుండాలని, అన్ని రంగాలవారు ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో ఈ హోమం నిర్వహించినట్టు శ్రీనివాసరావు తెలిపారు. అయ్యప్ప మాలధారులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు కుతుకులూరులో మెగా వైద్య శిబిరం

అనపర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుతుకులూరులో ఈ నెల 10న టీడీపీ నాయకుడు పులగం తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.శనివారం ఆయన రామవరంలో మాట్లాడుతూ ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో కంటి, జనరల్ సర్జన్, గైనకాలజీ, డెంటల్‌కు సంబంధించిన వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి గ్రామానికి చెందిన పలువురికి వైద్యం అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సులతో మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. గ్రామానికి చెందిన కొల్లెపార జ్యోతి పద్మజకు రూ.42,292, అడపా దుర్గా హనుశ్రీకి రూ.60,012 విలువైన చెక్కులను అందజేశారు.. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

ట్రైసైకిల్‌కు దరఖాస్తు చేసుకోండి

విభిన్నప్రతిభావంతుల సంస్థ మేనేజర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడు చక్రాల మోటారు వాహనం కోసం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 25లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంస్థ జిల్లా మేనేజర్ ఏవై శ్రీనివాస్ తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలలోపు కలిగి, 18-45ఏళ్ల మధ్య వయసు ఉండి, 70% లేదా అంతకంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్నవారు www.apdascac.ap.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు సమర్పించాలన్నారు. అభ్యర్థి డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. గతంలో వాహనం పొందిన వారు అనర్హులని చెప్పారు. వేతనం పొందుతూ ఒక ఏడాది అనుభవం కలిగిన వాళ్ల ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. దళారులను నమ్మవద్దని, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గానికి 10 చొప్పున మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి షాట్‌పుట్‌లో హాసినికి తృతీయ స్థానం



అనపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో అనపర్తి జీబీఆర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.హాసిని శ్రీసాయి కౌశిత తృతీయ స్థానంలో నిలిచింది. అండర్-14 విభాగంలో హాసిని ప్రతిభ కనబరిచినట్టు హెచ్‌ఎమ్ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, డీన్ జి.హరిప్రసాద్, హెచ్‌ఎం భువనేశ్వరి, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రశాంతిరెడ్డి, గేమ్స్ డైరెక్టర్ మహేంద్రరెడ్డి అభినందించారు.

వార్షిక క్రీడోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం వార్షిక స్పోర్ట్స్‌మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ ఏబీ సుబ్బరాజు హాజరయ్యారు. సిస్టర్ రోజ్‌మిన్ మాథ్యు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కోడి ప్రవీణ్, ప్రిన్సిపాల్ ఆన్‌మేరి పాల్గొన్నారు. క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి దోహదపడతాయని వారన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వార్షిక క్రీడోత్సవంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

విద్యార్థులకు రోల్‌ప్లే, డ్రామా పోటీలు



ఆనం రోటరీ హాల్‌లో డ్రామా ప్రదర్శనలో ఓ సన్నివేశం

రాజహేంద్రవరం కల్చరల్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి హైస్కూల్లో విద్యార్థులకు ఈ నెల 6నుంచి 8వరకు ఆనం రోటరీ హాల్లో రోల్ ప్లే, డ్రామా పోటీలు నిర్వహించారు.న్యాయ నిర్ణేతలుగా మహమ్మద్ బషీర్, నూజిళ్ల సూర్యనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్ మాట్లాడుతూ పంచతంత్ర కథలను, ఇతర నైతిక విలువలు గల పుస్తకాల ఆధారంగా విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సుంకర మల్లికార్జున్, ప్రిన్సిపాల్, అకాడమిక్ ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలులో నగర సంకీర్తన

బిక్కవోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో కార్తీక మాసం సందర్భంగా శనివారం పలువురు భక్తులు నగర సంకీర్తన చేశారు. తెల్లవారుజామున బయలుదేరిన వీరు గ్రామంలోని ఆలయాలన్నింటినీ దర్శించారు. నంతరం గోలింగేశ్వరస్వామి ఆలయానికి చేరి పూజలు జరిపారు.కార్యక్రమంలో నాగు, జిలాని, వెంకటరామయ్య, అప్పారావు, చందు పాల్గొన్నారు.

శెట్టిబలిజల సంక్షేమానికి కృషి

- శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు
- పలుచోట్ల వనసమారాధనలు



దివాన్‌చెరువులో పూజలు చేస్తున్న సత్తిబాబు, ఆర్‌ఎస్ తదితరులు

దివాన్‌చెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. దివాన్‌చెరువుకు చెందిన వీవీవీ సత్యనారాయణ, మల్లిబాబు, సురేంద్రకుమార్ స్థానిక సూర్యనారాయణ గార్డెన్స్‌లో శనివారం కార్తీక వనసమారాధనను ఏర్పాటు చేశారు. సత్తిబాబుతోపాటు శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మార్గాని నాగేశ్వరరావు, బుడ్డిగ శ్రీనివాస్, రెడ్డి రాజు, మార్గాని చంటిబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు, గీత కులాలు ఆర్థికంగా బలపడేందుకు 50శాతం రాయితీ తెచ్చామన్నారు.ఈ సందర్భంగా మల్లిబాబు, సత్యనారాయణ, సురేంద్రకుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో గంగిశెట్టి చంటిబాబు, ఖండవిల్లి లక్ష్మి, దాసరి శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, బత్తుల నాగేశ్వరరావు, రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎంపీల ఆధ్వర్యంలో..

కోరుకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్(ది పీఎంపీ అసోసి యేషన్) కోరుకొండ శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన సన్‌స్టార్ హాస్పిటల్ సహకారంతో బూరుగుపూడి ఆకుల వెంకటేశ్వరరావు తోటలో మండలాధ్యక్షుడు కుంచే వినోద్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు, కార్తీక వనసమారాధన నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద కార్తీక మాస దామోదర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.చిన్ని, అడపా శ్రీనివాస్, రహమాన్ ఖాన్, మట్టా రమేష్, సూరిశెట్టి భాస్కర్, బీహెచ్ శివకుమార్, యు.ప్రసాద్‌బాబు, కె.సత్తిబాబు, ఎ.నాగేశ్వరరావు, టి.రామకృష్ణ, పీవీఎస్ ప్రసాద్, గంగాధర్, జోగారావు, డి.వీర్రాజు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోకవరం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో గోకవరం-రంపయ్రంపాలెం రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో జరిగిన వనసమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సత్తిబాబు, వల్లీదేవి దంపతులు ఉసిరి చెట్టు వద్ద పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. కోరుకొండ మండలం మధురపూడిలోని బేబీరావు గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని 44 ప్రభుత్వ శాఖల ఉద్యోగులు హాజరయ్యాయరు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పిగిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సమేతంగా వనసమారాధన జరపడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేదారేశ్వరరావు, కిషోర్, కేఆర్ సూర్యనారాయణ, జి.అనిత, ఎం.ఇందిర, అంజలి, లక్ష్మి, ఇందిర సుజాత తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండ: వన సమారాధనలో పాల్గొన్న పీఎంపీలు



గోకవరంలో వన సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



మధురపూడిలో భోజనాలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

పోలవరం నిర్వాసితులకు సగం ప్యాకేజీనా!

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేయడం దారుణమని సగం ప్యాకేజీ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు 2014 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త భూసేకరణ చట్టం ప్రకారం రూ.6.86 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు, ఇతర కులస్తులకు రూ.6.36 లక్షలు చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్యాకేజీ పెంచితే ఒక్కొక్క నిర్వాసితుడికి రూ.11.80 లక్షలు, ఎస్టీలు అటవీ ఉత్పత్తులు కోల్పోతున్నందున పీసా చట్టం ప్రకారం ఒక్కొక్కరికి రూ.2 లక్షలు అదనంగా కలిపి రూ.13.80 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా నష్టం కలిగేలా వ్యవహరించడం కూడా ఎస్సీఎస్టీ చట్ట ప్రకారం నేరమని 2016 సవరణ చట్టంలో ఉందన్నారు. 2018 సవరణ చట్టం ద్వారా సెక్షన్ 18ఎ చేర్చారన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ అధికారులపై బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ జరుపకుండానే ఎఫ్ఐఆర్ నమోదవుతుందన్నారు. అధికారులు ఎస్సీఎస్టీలకు చెల్లించే ఆర్థిక విషయాల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని లేకుంటే నేరస్తులవుతారని ఆదివాసీ మహాసభ తరుపున హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సగం ప్యాకేజీలు ఇచ్చి అన్యాయం చేస్తున్న వ్యవహారంపై రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖలు సమర్పిస్తామన్నారు. నిర్వాసితుల ఫిర్యాదులు స్వీకరించేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.నిర్వాసితులకు న్యాయం చేయకపోతే ఆదివాసీ మహాసభ తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మిడియం వెంకటస్వామి, అరగంటి వీరభద్రారెడ్డి, మిడియం వెంకటేష్, గిన్నెపల్లి వెంకటరెడ్డిసరియం విజయరత్నకుమార్, జక్కుల పాండవులు, అరగంటి నాగిరెడ్డి పాల్గొన్నారు.

వెలుగుబంద హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్ అందజేస్తున్న ఛాంబర్ ట్రస్ట్ ప్రతినిధులు

రాజానగరం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నిమిత్తం రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ వెలుగుబందలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.అగ్నేష్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర-జగన్నాథపురి సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రగా దివాన్‌చెరువు చేరిన దీపక్ పాటిల్

దివాన్‌చెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన దీపక్‌పాటిల్ అనే 70 ఏళ్ల వృద్ధుడు మహారాష్ట్రలోని మహలక్ష్మి కొల్హాపూర్ నుంచి ఒడిస్సాలోని జగన్నాథపురికి సైకిల్‌పై చేస్తున్న యాత్ర శనివారం దివాన్‌చెరువుకు చేరింది. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతి ఆయనను పలకరించగా మహలక్ష్మికొల్హాపూర్ నుంచి తొమ్మిది రోజుల క్రితం ఈసైకిల్ యాత్ర ప్రారంభించానని, మొత్తం 1600 కి.మీ ప్రయాణించి జగన్నాథపురికి చేరవలసి ఉండగా ఇంత వరకూ 700 కి.మీ. దూరం ప్రయాణం పూర్తయ్యిందని తెలిపారు. మిగిలిన దూరాన్ని మరో తొమ్మిది రోజుల్లో పూర్తిచేస్తానని చెప్పారు. దివాన్‌చెరువు చేరే సరికి తన సైకిల్ మరమ్మతుకు గురి కావడంతో చేయించుకుని యాత్ర కొనసాగిస్తానన్నారు. తాను పాడురంగ విఠల్ భక్తుడనని, సైకిల్‌పై యాత్రలు చేయడం తనకు ఇష్టమని అన్నారు. గతంలో సైకిల్‌పై విష్ణుదేవ్ నుంచి కన్యాకుమారి వరకూ ఒకసారి, కొల్హాపురి నుంచి కాశీ అక్కడి నుంచి అయోధ్యకు రెండుసార్లు సైకిల్ పై యాత్ర సాగించానని తెలిపారు. 70 ఏళ్ల వయస్సులో ఉత్సాహంగా సుదూర ప్రాంతాలకు సైకిల్‌యాత్ర చేస్తున్న పాటిల్‌ను పలువురు స్థానికులు అభినందించారు.

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నరసింహమూర్తి



నరసింహమూర్తిని అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన జనసేన నాయకుడు తేజోమూర్తుల నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని బ్రాహ్మణ కార్పొరేషన్ భవనంలో శనివారం కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహా పలువురు మంత్రులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు, సంస్థ ఎండీ దొరబాబు, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతి తండ్రిపై యువకుడి దాడి

గోకవరం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతికి మరో యువకుడితో నిశ్చితార్థం ఎలా చేస్తారంటూ ఓ యువకుడు యువతి తండ్రిపై దాడి చేసిన సంఘటన శనివారం మండలంలోని గాదెలపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆనందరావు తన కుమార్తె నిశ్చితార్థం వేడుకను ఇంటి వద్ద నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సీతానగరం మండలం నల్గొండ గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు మరో ఇద్దరితో కలిసి అక్కడికి చేరుకున్నాడు. తాను ప్రేమించిన యువతిని మరో వ్యక్తికి ఇచ్చి ఎలా వివాహం చేస్తారంటూ ఘర్షణకు దిగాడు. అడ్డుకోబోయిన ఆనందరావుపై తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో దాడి చేశాడు. గాయాలపాలైన ఆనందరావును బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వంశీని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. అతని వద్ద మరో రెండు బ్లేడులు లభ్యమైనట్టు స్థానికులు చెప్పుకొచ్చారు.

పీస్ పోస్టర్ పోటీలు

బిక్కవోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పీస్ పోస్టర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 14 బహుమతులు అందజేస్తామని, అలాగే జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని లయన్స్ క్లబ్ ప్రతినిధి ఆర్‌ఎఆర్‌కే చౌదరి తెలిపారు. పీడీ యువరాజారెడ్డి, లయన్స్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, చత్రపతి శివాజీ, డ్రాయింగ్ టీచర్లు మూర్తి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



పార్కులతో నగర వాసులకు ఆహ్లాదం

అల్‌బ్యాంక్ కాలనీలో మ్యూజిక్ పార్క్‌ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 10వ డివిజన్ అల్‌బ్యాంక్ కాలనీలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మ్యూజిక్ పార్క్‌ను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్కులో సంగీతాన్ని ఆస్వాదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో గతంలో అభివృద్ధికి నోచుకోని 30 పార్కులను కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. ఇందులో భాగంగా ఐదు పార్కులను రూ.1.95 కోట్లతో అభివృద్ధి చేశామని, వాటిలో ఇప్పటికే నాలుగింటిని ప్రారంభించామన్నారు. మ్యూజిక్ థీమ్‌తో అభివృద్ధి చేసిన ఈ పార్కులో సంగీత ప్రియులను అలరించే రీతిలో ఆహ్లా దకర వాతావరణం కల్పించామని, ప్రజలు సరైన రీతిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన నాలుగేళ్ల యశ్వంత్ ఆడుకుంటూ వెళ్లి వేడినీళ్లలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దానవాయిపేటలో శ్రీ హాస్పటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయాన్ని శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వాసు ఆయనతో కలిసి ఆసుపత్రికి చేరుకుని బాలుడ్ని పరామర్శించి వైద్యానికి భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.30 వేలు నగదును అందించారు.

న్యాయసేవల దినోత్సవం

రాజానగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ న్యాయసేవల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. జీజీయూ మహిళాసెల్ కన్వీనర్ ఎస్.శ్రీగౌరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదిగా చేరిన అధ్యాపకురాలు కర్రి రోజా విద్యార్థులకు చట్టపరమైన హక్కులు, మహిళలు భద్రత వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో డీన్ బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.




కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం కార్తీక చందనోత్సవం నిర్వహించారు. మూల విరాట్‌కు 9 కిలోల చందనాన్ని అద్దారు. -కోరుకొండ

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆర్యన్
సూర్యమినీ	: ఫీనిక్స్
సూర్యప్యాలస్	: ప్రెడేటర్
స్వామి	: జటాధర
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమిస్తున్నా, కె-ర్యాంప్
శివజ్యోతి	: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
రాజా	: జటాధర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కృష్ణలీల
రంభ	: ప్రెడేటర్
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహల్(నామవరం)	: ప్రెడేటర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది గర్ల్ ఫ్రెండ్
వెంకటసూర్య(కడియం)	: జటాధర
సత్యగౌరి (అనపర్తి)	: జటాధర
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్





రాజమహేంద్రవరం వైపు అభివృద్ధి పరుగు

రేపు, ఎల్లుండి కేంద్ర బృందం పర్యటన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం (ఐఎంసిటి) ఈ నెల 10,11 తేదీల్లో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమి బసు నేతృత్వంలో 8 మంది సభ్యులతో కూడిన బృందం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తుందన్నారు. ఈ బృందం సోమవారం ఉదయం విజయవాడ చేరుకుని తాడేపల్లిలోని ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో క్షేత్ర పర్యటన చేపడుతుందన్నారు. ఒక బృందం ప్రకాశం, బాపట్ల జిల్లాలను సందర్శిస్తుందని.. రెండో బృందం ఏలూరు ,కృష్ణా, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ బృందం తుఫాన్ నష్టం, పునరావాస చర్యలు, ప్రభుత్వ యంత్రాంగం స్పందన వంటి అంశాలను పరిశీలించి నివేదికను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పిస్తుందన్నారు. బృందం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ,సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బృందంతో సమన్వయం చేసేందుకు విపత్తు నిర్వహణ డైరెక్టర్ ప్రఖార్ జైన్, రాష్ట్ర స్థాయి అనుసంధాన అధికారిగా ఏపీఎస్‌డీఎంఏ ఈడీ వెంకట దీపక్‌ను నియమించారని తెలిపారు.

రేపు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక) సోమవారం యథాతథంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు వ్యయప్రయాసలకు లోను కాకుండా డివిజన్, మండల స్థాయి కేంద్రాలు ,గ్రామ వార్డు సచివాయాల్లో అర్జీలు సమర్పించి పరిష్కారం పొందవచ్చన్నారు.1100 టోల్‌ఫ్రీ నెంబరు లేదా మీకోసం .ఏపీజీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.





కొవ్వూరు వైపు అభివృద్ధి దిగదుడుపు

ఇటు ఓకే.. అటు షాకే!

ఇంతలో ఎంత తేడా.. రాజమహేంద్రవరం, కొవ్వూరు ఈ జిల్లాలోనివే.. గోదావరికి అటూ ఇటూ ఉంటాయి.. రాజమహేంద్రవరం వైపు గోదావరి బండ్ చూస్తే ఆహా ఎంత అందంగా ఉందో అనిపిస్తుంది.. అంతే కాదు.. ఇటీవల అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అదే కొవ్వూరు వైపు చూస్తే చింతే.. చాలా అధ్వానంగా ఉంటుంది. ఈ చిత్రాల్లోనే చూడండి.. చిట్టడవిలా ఎలా ఉందో.. కలెక్టరమ్మా.. ఒకసారి చూడమ్మా.. - కొవ్వూరు

8



దారి.. చూపారు!

జలదారులివే..

కాకినాడ నుంచి రాజమహేంద్ర వరం, రాజమహేంద్రవరం-విజయవాడ, రాజమహేంద్ర వరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నరసాపురం, నర సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూ రు వరకు జలరవాణా రూట్లను గుర్తించారు. ఈ మార్గాల్లో పలు పరిశ్రమలకు కార్గో రవా ణాతో పాటు పర్యాటక బోట్లను నడిపేందుకు అనుమతులిస్తూ ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానించారు. కాకినాడ నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలంతో పాటు పలు ఇతర మార్గాల్లోను భారీ రివర్ క్రూయిజ్‌లను నడపవచ్చని ప్రతిపాదించారు. ఇటీవల ఎంపిక చేసిన జల రవాణా మార్గాల్లో వ్యాపారాలు చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి.కింగ్‌హం కాలువ అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తర్వాత వీటితో చర్చలు జరిపి సరకు, పర్యాటక రవాణాకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టనున్నారు.

జల రవాణాకు మార్గం సుగమం

- కాకినాడ టూ పుదుచ్చేరి
- బకింగ్‌హం కెనాల్‌కు మంచిరోజులు
- పురాతన జలరవాణాకు పచ్చజెండా
- ఐడబ్ల్యూఏఐతో సర్కారు ఒప్పందం
- రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధి
- ఐదేళ్ల పాటు ఎంవోయూ అమలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. ఈ మార్గంలో గోదావరి,కృష్ణా నదుల మీదుగా సరుకు రవాణా, పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఈ కాలువకు పూర్వ వైభవం తెచ్చే దిశగా రంగం సిద్ధమవుతోంది.ఈ మేరకు కాలువ అభివృద్ధికి ఇన్నేళ్లకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో ఎంవోయూ కుదిరింది. ఐదేళ్ల పాటు అమల్లో ఉండనున్న ఒప్పందం మేరకు ఈ రెండూ కలిసి బకింగ్‌హం కెనాల్ అభివృద్ధి, జల రవాణా మార్గాల అన్వేషణ, కాలువల డ్రెడ్జింగ్, రివర్ క్రూయిజ్ పర్యాటకాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి. తొలుత రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధికి ఐడబ్ల్యూఏఐ శ్రీకారం చుట్టనుంది.

నాడు ఎంతో ప్రసిద్ధి

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువ బ్రిటిష్ కాలంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కాకినాడ నుంచి మొదలయ్యే ఈ కాలువ గోదావరి, కృష్ణా మీదుగా తమిళనాడులోని విల్లుపురం వరకు 796 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్ర పరిధిలో 257 కి.మీ. వరకు ఉంది. కాకినాడ నుంచి గోదావరి మీదుగా తమిళనాడు వరకు అప్పట్లో జల రవాణా కింద సరుకులు భారీగా ఎగుమతి,దిగుమతి అయ్యేవి. అయితే క్రమేపీ కాలువ పూర్తిగా పూడుకుపోవ డంతో ప్రభుత్వాలు గాలికొదిలేశాయి.

ఒప్పందాలు ఇలా..

జల రవాణాకు డిమాండ్ పెరగడం, కారుచౌక రవాణామార్గం కావడంతో కాలువను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణ యించారు.ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువలను అభివృద్ధి చేసే ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) తోను చర్చలు జరిపారు.ఈ మేరకు వారం కిందట ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో కాలువను రూ.80 కోట్లతో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి.ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నౌకల రాకపోకలకు వీలుగా కాలు వల్లో పూడిక తీయడం, ఓడలు రాకపోకలు సాగించేలా వెస్సల్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టం ఏర్పాటు, నావిగేషన్ వ్యవస్థ తీర్చిదిద్దడం,కాలువల్లో రివర్ క్రూయిజ్‌లు నడిపేలా సహా యపడడం వంటివన్నీ మౌలిక సదుపాయాల రూపంలో తీర్చిదిద్దనుంది. సెకండ్‌పార్టీ కింద రాష్ట్రప్రభుత్వం తరపున జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాత రివర్ క్రూయిజ్ నౌకలు బెర్తింగ్ అవడానికి కావాల్సిన భూముల కేటా యింపు, బకింగ్ హం కాలువలో డ్రెడ్జింగ్ తర్వాత తవ్వితీసిన భారీ బురద, మట్టిని నిల్వ చేసేందుకు తగిన స్థలాలు, సరుకు రవాణా, పర్యాటక నౌకల రాకపోకలు, వెస్సల్ ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఐదేళ్ల పాటు ఇవన్నీ ఈ రెండు ఒప్పందం ప్రకారం చేయా లని ఎంవోయూలో ప్రస్తావించారు.ఈ నేపథ్యం లో ఇన్నేళ్ల తర్వాత బకింగ్ హం కెనాల్ అభి వృద్ధికి మార్గం సుగమం కానుంది.

ఎన్ని అవకాశాలో..

బకింగ్‌హం కాలువ ద్వారా సరుకు రవాణాకు మళ్లీ ఊపిరిలూదాలని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది.ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడిపోయాయి.మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు బకింగ్‌హం కాలువ అభివృద్ధికి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చేలా ఒప్పించారు. ఒప్పందానికి ముందే ప్రభుత్వం తరఫున పది జల రవాణా మార్గాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసే లా ప్రైవేటు సంస్థలను టెండర్ల ద్వారా ఆహ్వానించింది.ఈ మార్గాల్లో డ్రెడ్జింగ్ అనంతరం రవాణా కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలు సాగించేలా నిబంధనలు రూపొందించారు.


అంబేడ్కర్ మునిమనవడు రాజారత్న అశోక్ అంబేడ్కర్, బౌద్ధ భిక్షువులకు స్వాగతం పలుకుతున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

పాండవుల మెట్టకు 1800 ఏళ్లు

బుద్ధిజం ద్వారానే సమాజ వికాసం- రాజారత్న అశోక్ అంబేడ్కర్

కోరుకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బుద్ధిజం ద్వారానే సమాజ వికాసం జరుగుతుందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్ మునిమనవడు రాజా రత్న అశోక్ అంబేడ్కర్ పేర్కొన్నారు.కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో పాండువుల మెట్ట వద్ద శనివారం నిర్వహించిన భారతీయ బౌద్ధ వారసత్వ సాంస్కృతిక ఉత్సవంలో ఆయన మాట్లాడారు. వేదాలు, మనుస్మృతిలో ఎక్కడా కుల ప్రస్తావన లేదని దళితులను ఒక్కో రాష్ట్రంలో ఒక్కోపేరుతో పిలుస్తున్నారన్నారు. పాండవుల మెట్ట రెండో శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన బౌద్ధ వారసత్వ స్థలం.. ఈ కొండపై బౌద్ధ సన్యాసులు నివసించిన గదులు, చైత్యం,స్తూపాలు, పూజ గది, డ్రెయినేజీ వ్యవస్థ, పెద్ద హాలు తవ్వకాల్లో బయట పడ్డాయన్నారు. ఈ స్థలం దాదాపు 1800 సంవత్సరాల పురాతన చరిత్ర కలిగి ఉందని తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కార్తీకమాసంలో పిల్లలు, పెద్దలు పాండవుల మెట్టకు వచ్చి చారిత్రక, ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతారన్నారు. బౌద్ధ మత వ్యాప్తి, ఆధ్యాత్మికత, పురాతన భారతీయ నిర్మాణ కళకు ప్రతీకగా నిలిచేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో టిబెటన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ పథకం కింద అభివృద్ధి చేస్తామన్నారు. బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి రూ.21 కోట్లతో డీపీఆర్ రూపొందించినట్టు తెలిపారు. సమావేశంలో బుద్దిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చిలకపాటి సుబ్బారావు, జనచైతన్య మండలి నాయకుడు నేలపాటి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కాపవర ం సర్పంచ్ జాజుల రాము, టీడీపీ నాయకులు తెలగంశెట్టి శ్రీనివాసు, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ వీరగణేష్ పాల్గొన్నారు.



బెల్ట్ తీస్తారట!

సారా జోరు.. బెల్ట్ షాపుల హుషారు

- నవోదయంలో కాకినాడ వెనుకంజ
- తూర్పు, కోనసీమ ముందంజ
- 600 మద్యం దుకాణాలు
- పలు చోట్ల ఎమ్మార్పీ కంటే ఎక్కువ
- మందుబాబుల బేజారు
- అయినా పట్టని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సారాతో పాటు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాల్లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణ యించింది. గత శుక్రవారం రాష్ట్ర ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సయిజ్ అధికారులతో నవోదయం-2.0, బెల్ట్‌షాపుల పరిస్థితిపై సమీక్షించారు. ఎక్కడా ఒక్క బెల్ట్ షాపు ఉండకూదని ప్రభుత్వం నిర్ణయించి నట్టు ప్రకటించారు. దీంతో అధికారులు ఆరా తీసి కేసులు పెడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు కొవ్వూరు డివిజన్‌లో సుమారు 600 వరకు అధికారిక మద్యం షాపులు ఉన్నాయి. ఆయా షాపుల యజమానులే సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. కొందరైతే ఆర్గనైజ్డ్‌గా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. నవోదయం 2.0లో భాగంగా ఎక్కడా సారా ,బెల్ట్ షాపులు ఉండకూడదని, నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలని ప్రభుత్వం అధికారుల ను ఆదేశించింది.దీనిలో భాగంగా తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సారాపై ఉక్కుపాదం మోపుతున్నారు. సారా అరికట్టడంలో కాకినాడ జిల్లా వెనుక బడి ఉంది. ఈ నెల 15వ తేదీ లోపు అక్కడ కూడా సారారహితంగా చేయవలసి ఉందని ప్రభుత్వం ఆదేశించింది.ఈ నేపథ్యంలోపూర్తిగా నిర్మూలించాలనే ల క్ష్యంతో ముందుకు వెళుతున్నారు.

ఎక్సయిజ్ అధికారుల దూకుడు



మూడు జిల్లాల ఎక్సయిజ్ అధికారులు దూకుడు పెంచారు. బెల్ట్‌షాపులపై దాడులు ఆరంభించారు. ఏడాదిలోపులో వందలాది బెల్ట్‌షాపులపై కేసులు పెట్టి నట్టు తూర్పుగోదావరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. రాజమండ్రి సౌత్ స్టేషన్ పరిధిలో కేవలం పది రోజుల్లో 8 షాపులపై కేసులు పెట్టి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అధికార మద్యం షాపుల నిర్వాహకుల వాదన వేరేగా ఉంది. తమకు ప్రభుత్వం ఇస్తానని చెప్పిన 20 శాతం కమీషన్ ఇవ్వడంలేదని, కేవలం 13.5 శాతం మాత్రమే ఇస్తుండడంతో నష్టాల్లో మునిగిపోయామనే వాదన వినిపిస్తున్నారు.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మద్యం వ్యాపారాలు ఇటీవల ఒక మీటింగ్ పెట్టి 15 రోజుల్లో తమ సమ స్యలు పరిష్కరించకపోతే తాము షాపులు నిర్వహించలేమని అల్టిమేటం ఇచ్చారు..

బదిలీ భయం...



ఉన్నారా..సార్!

అడకత్తెరలో అబ్కారీ శాఖ

బదిలీ అంటే ఉద్యోగితో పాటు కుటుంబం కదలాల్సి ఉంటుంది.ఈ క్రమంలో పిల్లల చదు వులు, ఇంట్లో వృద్ధులైన, అనారోగ్యంతో ఉన్న కుటుంబీకుల విషయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్సయిజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం ఎస్ఈబీ అంటూ ఓ కొత్త పదాన్ని సృష్టించి దానిలో కలిపేసింది. కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత అబ్కారీ శాఖకు మళ్లీ ఆయువు పోసింది. అప్పటి వరకూ పొరుగు గొడుగులో అంతర్మథనంతో విధులు నెట్టుకొ చ్చిన అధికారులు, సిబ్బంది హమ్మయ్య అనుకున్నారు.కానీ జిల్లా కేంద్రం రాజమహేంద్రవ రం సిటీ, రూరల్‌కి సంబంధించి ఇంకా కుదురు కోలేదు. రాజకీయ నాయకుల ఎత్తుగడల్లో అధికారులను పావులుగా చేస్తున్నారు. మరో వైపు మద్యం వ్యాపారుల వైరాల్లోకి అబ్కారీ శాఖను లాగుతున్నారు. దీంతో నిఘా వర్గాలు కూపీ లాగడం ఆరంభించాయి. మరో వైపు ఏసీబీ అధికారులు ఓ వ్యాపారి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారని సమాచారం. ఈ క్రమంలో సిటీ, రూరల్‌కి సంబంధిం చిన నార్త్,సౌత్ స్టేషన్ల లో మొత్తం సిబ్బందిని బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావించారు.

- సిబ్బందిపై పొలిటికల్ ఎఫెక్ట్
- ఊహూ అంటే ట్రాన్స్‌ఫర్
- నలిగిపోతున్న అధికారులు
- కుదురుకునే లోపే సీటు కదలిక
- ఆ రెండు స్టేషన్లలో ఇదీ తీరు
- 6 నెలలు తిరగకముందే మళ్లీ
- నేడో,రేపో బదిలీల బంతాట

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అబ్కారీ అధికారులు, సిబ్బంది పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా తయారైంది. కరవమంటే కప్పకు కోపం విడవ మంటే పాముకు కోపం అన్నట్టుగా విధులు ఉండడంతో నెట్టుకురావడం కష్టమవుతోందని అంటున్నారు.రాజకీయ నాయకులు చల్లుకుంటున్న బురద తమ యూనిఫాంకి రాస్తుండడం.. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసు కొని కుర్చీలో కుదుటపడేలోపుగానే బదిలీ అంటూ కదుపుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆ రెండూ స్టేషన్లలో సమస్యలే..

సాధారణంగా ఎవరిపై అయినా ఆరోపణ వస్తే.. అది రుజువు అయితే వారిపై చర్యలకు ఉపక్రమించడం రివాజు. కానీ జిల్లా కేంద్రంలో మాత్రం రెండు స్టేషన్లనూ అతలాకుతలం చేసేస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో కానిస్టేబుల్ దగ్గర నుంచీ సీఐల వరకూ మొత్తం సిబ్బందిని బదిలీ చేశారు. రెండు స్టేషన్లకు రెగ్యులర్ సీఐ, ఎస్ఐలను ఇవ్వలేదు. సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు. సౌత్ స్టేషన్‌కి రెండు నెలల కిందట ఆలమూరు సీఐ ని ఇన్‌చార్జిగా నియమించారు. ఓ ఎస్ఐని తర్వాత ఇచ్చారు. పక్షం కిందట ఆయనను మళ్లీ ఆలమూరు పంపేసి స్టేషను బాధ్యతలు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్‌కి అప్పజెప్పారు. నార్త్ స్టేషనుకు రెగ్యులర్ సీఐ లేరు. ఇప్పటికీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐతోనే అదనపు విధులు నిర్వర్తింపజేస్తున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న రంపచోడవరం ఎస్ఐని ఓ నెల కిందట ఈ స్టేషను విధులు చూడాలని పంపించారు. అధికారులు, సిబ్బంది పరిస్థితి ఇలా అస్తవ్యస్తంగా ఉంది.

మళ్లీ బదిలీనా!



ఇప్పుడు ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ వీళ్లందరినీ బదిలీ చేస్తారని తెలుస్తోంది. నేడో, రేపో ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అధికారులు, సిబ్బంది ఆవేదన చెందుతు న్నారు.ఇలా ఆరోపణలు వస్తే అలా అందరినీ బాధ్యులను చేయ డం ఎంత వరకూ సమంజసమనే ప్రశ్న వినవస్తోంది. బదిలీ ఉత్తర్వుల్లో 'పరిపాలన సౌలభ్యం', 'తర్వాతి ఉత్తర్వులు అందే వరకూ' అని మాత్రమే స్పష్టం చేస్తున్నారు.ఇలా గంప గుత్తగా బదిలీలపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మళ్లీ కొత్తగా వచ్చే అధి కారి సీటులో టవల్ సర్దుకొనేలోపే ఉంటారో వెళ్లిపో తారో తెలియని పరిస్థితి నడుస్తోంది. దీంతో ఎన్ ఫోర్స్‌మెంట్‌పై ప్రతి కూల ప్రభావం పడుతోంది. మరోవైపు అధికా రులకు బెది రిం పు మెసేజ్ పంపే స్థాయికి పలువురు వ్యాపారులు తెగించారు. కోర్టు కేసులూ, వివరణలు ఇచ్చుకోవడం ఉద్యోగులకు నిత్యకృత్యమైపోయింది.ఈ గలాటా తట్టుకోలేక ఇక్కడి నుంచి వెళ్లిపోతామని కొందరు అంటుం టే.. కొత్త వారు రావడానికి ఇష్టపడడం లేదు. మొత్తానికి రాజకీయ నాయకుల చేష్టలు, మద్యం వ్యాపారుల గొడవలు జిల్లాలోని అబ్కారీని రోడ్డుకీడుస్తున్నాయి. నాయకులను, మద్యం వ్యాపా రులను గాడిలో పెట్టకపోతే అబ్కారీలో విధులకు తూర్పు తిరిగి వెతుక్కోవాల్సిందే!.


గృహ నిర్మాణం పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

పీఎంఏవై సర్వే వేగవంతం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం/గోకవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై 2.0 లో భాగంగా 1442 గృహాల సర్వే చేశారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. హౌసింగ్ అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ఈ నెలాఖరికి మొత్తం సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.ఆవాస్ ప్లస్ యాప్ లో ఏర్పడిన సాంకేతిక సమస్యలు పరి ష్కారం కావడంతో సర్వే తిరిగి ప్రారంభ మైందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 15,533 దరఖాస్తులు స్వీకరించగా 657 దరఖాస్తుల సర్వే గతంలోనే చేశామన్నారు. మిగిలిన 14,876 ఇళ్లలో ఇప్పటికే 1442 పూర్తి చేశామన్నారు. గోకవరం మండలం కామరాజుపేటలో జరుగుతున్న పీఎంఏవై సర్వే పనులను శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతీ కుటుం బం పేరు జాబితాలో చేర్చేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమా చారం సేకరిస్తున్నారని తెలిపారు. అన పర్తిలో 225 దరఖాస్తులు రాగా 22 సర్వే పూర్తయిందని, బిక్కవోలులో 345కి 20, చాగల్లులో 320కి 41, దేవరపల్లిలో 1278కి 20,గోకవరంలో 798కి 8, గోపాలపురంలో 1521కి 8, కడియంలో 575కి 6, కోరుకొండలో 1408కి 1, కొవ్వూరులో 299కి49, నల్లజర్లలో 2981కి 15, నిడదవోలులో 641కి 42, పెరవలిలో 666కి 188, రాజమహేంద్రవరం రూరల్‌లో 585 కి 76, రాజానగరంలో 1798కి 66, రంగంపేటలో 595కి 22, సీతానగరంలో 761కి 12, తాళ్లపూడిలో 435కి 46 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కార్తీకం శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైనది

● ప్రముఖ ప్రవచనకర్త పొన్నా కృష్ణబాబు శర్మ ● పట్టణంలో కార్తీకమాసంపై ఆధ్యాత్మిక ప్రవచనం

నిడదవోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైనదని ప్రముఖ ప్రవచనకర్త పొన్నా కృష్ణబాబు శర్మ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో నెల రోజులపాటు కార్తీక దామోదరుడిని స్మరిస్తూ నదీ స్నానం, దీపారాధన, దానధర్మాలు, ఉపవాసాలతో పూజించడం ఎంతో మంచిదని చెప్పారు. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో పరమ శివునికి పంచామృతాభిషేకం చేసుకోవడం, ఉసిరిచెట్టును పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కార్తీక పురాణం చెపుతున్న కృష్ణబాబు శర్మ

వైభవంగా ముత్యాలమ్మ ఆలయం ప్రారంభం

తాళ్లపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రావూరుపాడులో సుమారు రూ. 50 లక్షలతో పునఃనిర్మించిన గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని పుట్టింటి వారిగా, అత్తింటి వారిగా కొలిశెట్టి, చీకట్ల కుటుంబాల వారు, గ్రామస్థులు, భక్తుల సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేశారు. ముక్తేశ్వరానికి చెందిన ద్వి సహస్ర ప్రతిష్టాచార్యులు అల్లవరం సుబ్రహ్మణ్య దీక్షితుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రాణప్రతిష్ఠ పూజాది కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల నుంచి భక్తులు, బంధువులు రాకతో గ్రామం సందడిగా మారింది. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు సిద్దా దుర్గారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి దంపతులు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రేకపల్లి మంగామణి, ముత్యాలరావు దంపతులు పలువురు కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకున్న సుబ్బరాయచౌదరి దంపతులు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ మంగామణి దంపతులు

'ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి'


వేలివెన్నులో గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న శేషారావు, ప్రజలు

ఉండ్రాజవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలివెన్నులో శనివారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండలంలో ప్రకృతి వ్యవసాయ షాపులు

దేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో ప్రకృతి వ్యవసాయశాఖ బయో ఇన్‌పుట్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ మేనేజర్ బొర్రా తాతారావు అన్నారు. కురుకూరు, యర్నగూడెం, గౌరీపట్నం, యాదవోలు, దేవరపల్లిలో ప్రకృతి వ్యవసాయశాఖ బయో ఇన్‌పుట్స్ సెంటర్ల ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కురుకూరు సొసైటీ అధ్యక్షుడు యలమాటి భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది సతీశ్, శ్రీనివాస్, రామలక్ష్మి, రామ్మోహనరావు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


కురుకూరులో స్టాల్స్‌ను ప్రారంభించిన సొసైటీ అధ్యక్షుడు భాస్కరరావు

బిక్కవోలులో నగర సంకీర్తన

బిక్కవోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం గ్రామానికి చెందిన భక్తులు నగర సంకీర్తన చేశారు. తెల్లవారుజామున బయలు దేరి శివనామస్మరణ చేసుకుంటూ గ్రామంలోని ఆలయాలన్నింటినీ దర్శించారు. అనంతరం గోలింగేశ్వరస్వామి ఆలయం చేరి గోలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నాగు, జిలాని, వెంకటరామయ్య, అప్పారావు, చందు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మికత అవసరం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
● ఘనంగా త్యాజంపూడిలో కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు

దేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మికత అవసరమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం త్యాజంపూడిలో కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనికి ఆయన నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు కలిసి మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. 120 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయాన్ని పునః నిర్మాణం చేయడంతో గ్రామప్రజలు, దాతల సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయం వద్ద గణపవరం హోమం, విగ్రహాల ఊరేగింపు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి నిడదవోలు తారకరామారావు విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేరాబత్తుల సూరిబాబు, రాజపోషకులు యర్రం శెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఛైర్మన్ అల్లాడి బలరామకృష్ణ, సభ్యులు మానే పోలరాజు, గేలం పెద్దిరాజు, యర్రంశెట్టి రాము, పేరాబత్తుల రాము, దారప రెడ్డి రాము, టపాకోట సత్యనారా యణ, తదితరులు పాల్గొన్నారు. ఈ ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు రావిమెట్ల ఆశ్రమ వ్యవస్థాపకుడు యర్రంశెట్టి ఆనంద నారాయణ మూర్తి పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి


వాదాలకుంటలో సేంద్రియ ఎరువులు దుకాణాలు ప్రారంభిస్తున్న డీపీఎం తాతారావు

గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించి ఆరోగ్యకరమైన పంటను ఉత్పత్తి చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు రైతులకు సూచించారు. చిట్యాల, వాదాలకుంటలో సేంద్రియ కషాయాలు, ఎరువుల దుకాణాన్ని శనివారం రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ కషాయాలు, ఎరువులను వినియోగించిపండించిన పంటకు అధిక దిగుబడితో పాటు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. వ్యవసాయసాగులో ఖర్చు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుందన్నారు. రైతులు గెడా జోగేంద్ర ప్రసాద్, బంగారు బాబు, కృష్ణ, శేషగిరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సతీష్, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, అరుణ, దుర్గాదేవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

దైవ చింతనతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే


దొండపూడిలో అయ్యప్పదీక్షాదారుల కలశపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దొండపూడిలో గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో పుష్కలాంబ సహిత అయ్యప్పస్వామివారి 18 మెట్ల మహాకలశపూజా కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే అయ్యప్పదీక్షాపరులు ముత్యాలరాయుడుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అయ్యప్పస్వామి నామస్మరణంతో మారుమోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావావేశానికి లోనైన ప్రతి ఒక్కర్ని ఆధ్యాత్మిక చింతన ఆలోచింపజేయడంతోనే మనిషి నియంత్రణా శక్తి కలిగి ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల అయ్యప్ప దీక్షాపరులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్టర్లకు అండగా ఉంటా

నల్లజర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం నియోజకవర్గంలోని పాస్టర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు భరోసా ఇచ్చారు. శనివారం నల్లజర్ల టీడీఏ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవిస్తూ సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలను నియోజకవర్గ స్థాయిలో చేయడం జరుగుతోందని. ఈ ఏడాది డిసెంబరు 14వ తేదీన ఐక్య క్రిస్మస్ నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవవిశ్వాసులు పాస్టర్లు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని కోరారు. అలాగే పాస్టర్ల సమ స్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ ఏర్పాటు చేసి పలు వినతులను స్వీకరించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తానన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, రేషన్, హెల్త్‌కార్డులు, పింఛన్లు, వీధి దీపాల సౌకర్యం వంటి అంశాలపై వినతులు స్వీకరించారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల, మత వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఈ.మల్లిక అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లిక మాట్లాడుతూ ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం, సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతూ అమరులైన అమరవీరుల ఆశయసాధనకు పాటుపడాలన్నారు. అలాగే అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్వతి, కుమారి, భగవాన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం


నదిలో బోర్లాపడి ఉన్న మృతదేహం

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని మెరకవీధి గోదావరిమాత విగ్రహం వద్ద సీతారామ స్నానఘట్టం సమీపంలోని చర్చి పక్కన గోదావరి నదిలో మగ మృతదేహం బోర్లాపడి ఉందని స్థానికులు పోలీసులకు శనివారం సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం పూర్తిగా డీ కంపోజ్ అయిపోయి ఉంది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్, 94407 96622 నెంబర్‌కు సమాచారం అందజేయాలని సీఐ పి.విశ్వం తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికుడు

నిడదవోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు రైల్వేస్టేషన్‌లో శనివారం వాటర్ బాటిల్ కొనుక్కునేందుకు రైలు నుంచి కిందకు దిగుతుండగా ఓ వ్యక్తి రైలుకు, ప్లాట్‌ఫామ్ మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో అడుగు వేయడంతో ఇరుక్కుపోయాడు. దీన్ని గమనించిన తోటి ప్రయాణికులు సకాలంలో స్పందించి ఆయన్ని పైకి లాగారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం నుంచి ఆ కుటుంబం తిరుపతికి వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రాథమిక చికిత్స అనంతరం తిరిగి ఆ కుటుంబం మరో రైలులో తిరుపతికి పయనమయ్యింది.

గాయపడ్డ విద్యార్థులకు ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురంలో ఇటీవల మోటారు సైకిల్ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థులను వైసీపీ నాయకులు శనివారం పరామర్శించారు. మాజీఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. శ్రీసాయి స్ఫూర్తి హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు శ్రీలక్ష్మి, పోసమ్మను వెంకట్రావు పలకరించి అందించారు. కార్యక్రమంలో గూడా విజయరాజు, కే. పరశురామారావు, తోట రామకృష్ణ, యాళ్ల బాబూరావు, గండి రాంబాబు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

తాళ్లపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో కోడిపందేలు ఆడతున్నారనే సమాచా రంతో రూరల్ సీఐ విజయబాబు ఆదేశాల మేరకు శనివారం ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద గల రూ. 10,620 నగదు, ఒక కోడి, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకన్న ఆలయానికి రూ. 25 వేలు విరాళం


ఆలయ కమిటీ ఛైర్మన్‌కు నగదు అందిస్తున్న శివయ్య, సత్యవతి దంపతులు

దేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దేవరపల్లి గ్రామానికి చెందిన కాల్దరి శివయ్య, సత్యవతి దంపతులు శనివారం రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు వేదాశీర్వాచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం విద్యార్థులకు ప్రథమస్థానం


రాజమహేంద్రవరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఉండ్రాజవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన ఒకేషనల్ శిక్షణ వస్తువుల ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచినట్టు ఉండ్రాజవరం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి. రామకృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీన రాజమహేంద్రవరంలో జరిగిన ప్రదర్శన పోటీల్లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో విద్యార్థులు బహుమతులు గెలిపొందినట్టు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులైన ఎస్. సుభాషిణి, డి. ఎస్తేరురాణి, దుర్గాప్రసాద్‌తో పాటు శిక్షణ ఇచ్చిన బీ. దుర్గాశ్రీనివాస్‌ను ఎంఈవోలు, టీచర్లను అభినందించారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

నల్లజర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన తాడివర్ల హరిబాబు (28)విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హరిబాబు వ్యవసాయ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం స్నానం చేసేందుకు గీజర్ స్విచ్ వేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుప త్రికి తరలించారు.

రాజమండ్రి ఓకే.. కొవ్వూరు షాకే!

● కళావిహీనంగా గోదావరి బండ్
● డంపింగ్‌యార్డుగా చెత్త వేస్తున్న ప్రజలు
● ఆక్రమణలకు గురవుతున్నా ... పట్టించుకోని యంత్రాంగం

రాజమండ్రి వైపు గోదావరికి ఇటు రాజమహేంద్రవరం అటు కొవ్వూరు రెండూ ఒక జిల్లాలోనివే.. ఇంతలోనే ఎంత తేడా రాజమండ్రి వైపు గోదావరి బండ్‌ను చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. రానున్న పుష్కరాలకు మరింత అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఇటు కొవ్వూరులో గోదావరి బండ్ చూస్తే కళా విహీనంగా ఉంది. కలెక్టరమ్మా... ఒక్కసారి చూడమ్మా...



కొవ్వూరు లాంచీలరేవు వద్ద గోడ విరిగి పడిపోయిన దృశ్యం

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలో గోదావరి ఏటిగట్టు రోడ్డును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. దీంతో 2003 సంవత్సరంలో గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు సెంటర్ నుంచి గోదావరిమాత విగ్రహం వరకు సుందరీకరణ పనులు చేపట్టారు. మరలా 2015 గోదావరి పుష్కరాలలో గోదావరిమాత విగ్రహం నుంచి ఆరికిరేవుల రోడ్డు గామన్ బ్రిడ్జి వరకు పొడిగించారు. ఇందులో భాగంగా సుందరీకరణ పార్క్‌లో సప్త మహర్షుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. విజయవాడ, విశాఖపట్నం వైపు నుంచి పట్టణంలోకి వచ్చే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా బండ్‌ను పూలమొక్కలు, వాకింగ్ ట్రాక్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. బండ్ పార్క్‌పై నిర్వహణ మున్సిపాల్టీకి భారంగా మారింది. పుష్కరాల సమయంలో తప్ప, మరెప్పుడూ బండ్ కన్నెత్తి చూసిన నాయకుడు గానీ, అధికారి గానీ కానరావడం లేదు. దీంతో పార్క్‌పై ఆక్రమణలు చేపట్టి పక్కా కట్టడాలు చేపట్టినా... మున్సిపల్ యంత్రాంగం చూసీచూడనట్టు పోతోంది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచవలసిన బండ్ చిట్టడవిని తలపిస్తూ... కళావిహీనంగా తయారైంది. దీంతో విషపురుగులు, పాములకు నిలయమై ప్రజలు పార్క్‌లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా అఖండగోదావరి ప్రాజెక్టు పనుల్లో భాగంగా గోదావరి బండ్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొవ్వూరు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలనే లక్ష్యంతో 2003, 2015 పుష్కరాల సమయాల్లో సుమారు రూ. 25 కోట్లతో రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గామన్‌బ్రిడ్జి వరకు గోదావరి ఏటిగట్టుపై రెండువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించారు. గోడలపై ఇనుపజాలీలను ఏర్పాటుచేసి మధ్యలో సప్త మహర్షుల విగ్రహాలు, వాకింగ్ ట్రాక్, పూలమొక్కలు వేసి పర్యాటకంగా అభివృద్ధి చేసి సుందరీకరించారు. మున్సిపాల్టీకి పార్క్ నిర్వహణ భారంగా మారడంతో పుష్కరాల అనంతరం పార్క్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో పూలమొక్కలతో పాటు పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయి చిట్టడవిలా తయారయ్యింది. పచ్చదనం మొత్తం ఆవిరి అయిపోయింది. మరోవైపు ఇనుపజాలీలు విరిగిపోవడం, గోడలు బీటలు వారి పడిపోతున్నాయి. ఆకతాయిల విద్యుత్‌దీపాలను పగలగొట్టి తీగలను దొంగిలించడం ఏటిగట్టు మొత్తం అంధకారం చోటుచేసుకుంటుంది. గోడలపై ఉన్న ఇనుప జాలీలను కొంతమంది విరగగొట్టి లోపలికి ప్రవేశించి, రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బండ్‌పై ఏర్పాటుచేసిన సప్త మహర్షుల విగ్రహాల చేతుల్లో ఉన్న కమండాలుతుప్పుపట్టి విరిగిపోయాయి. అంతే కాకుండా విగ్రహాలపై రావిచెట్లు మొలుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు అసహనాన్ని వ్యక్తం చే స్తున్నారు. వ్యాయామ పరికరాలు, పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ఉయ్యాలలు తుప్పుపట్టి మరమ్మతులకు గురవుతున్నాయి. విషపురుగులు, పాము పుట్టలు పెటడంతో ప్రజలు పార్క్‌లోకి రావాలంటేనే భయపడుతున్నారు. గామన్‌బ్రిడ్జి వద్ద నుంచి టాంచీలరేవు వరకు సమీప ప్రాంతాలలోని ప్రజలు రోజులవారి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకువచ్చి పార్క్‌ను కాస్తా డంపింగ్ యార్డుగా మార్చివేశారు. గోదావరి బండ్‌పై ఉన్న సుందరీకరణ పార్క్‌ను వివేకానంద, అంబేద్కర్, గౌతమ మహర్షి, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు వంటి మహానీయుల పేర్లతో పార్క్‌లుగా విభజించారు. ఆ పార్క్‌లలో రూ. 2.20 కోట్లతో వ్యాయామ పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. కొంత కాలం బాగానే ఉన్నప్పటికీ తోటమాలి, నైట్ వాచ్‌మేన్‌ను ఏర్పాటుచేయకపోవడంతో పార్క్‌లో పిచిమొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగి చిట్టడవిలా తయారయ్యింది. విషపురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు పార్క్‌లలోకి రావడం మానేశారు. దీంతో వ్యాయామ పరికరాలు, చిన్నపిల్లల ఆటవస్తువులు తుప్పపట్టి మరమ్మత్తులకు గురవుతున్నాయి. అలాగే భక్తాంజనేయ స్నానఘట్టం నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి వరకు, గోదావరిమాత విగ్రహం నుంచి గామన్ వంతెన దండకుంటరేవు వరకు బండ్‌లో కాగితం పువ్వులు, ఇతర ముళ్ల చెట్టు కొమ్మలు ఏపుగా పెరిగి సుందరీకరణ పార్క్ గోడలు దాటి బయటకు వచ్చేశాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారికి చెట్టుకొమ్మలు కళ్లలలో గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సుందరీకరణ పార్క్ నిర్వహణ పట్ల కౌన్సిల్ సమావేశాల్లో అసంతృప్తిని వ్యక్త పరిచన సంఘటనలు అనేకం ఉన్నాయి. పుష్కరాల సమయంలో యాత్రికులకు ఆహ్లాదా న్ని పంచిన సుందరీకరణ పార్క్ పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా ఉందన్నారు. తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించి కడియం నర్సరీల నుంచి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పూలమొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. 2027లో వస్తున్న గోదావరి పుష్కరాల నాటికి అయినా సుందరీకరణ పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ముప్పి డి వెంకటేశ్వరరావు మున్సిపల్ పాలకవర్గం, అధికారులకు సూచించారు.


మహర్షి విగ్రహంపై మొలిచిన రావిచెట్టు, విరిగిన కమండలం


రుడా పార్క్‌లో విరిగిన ఏనుగు దంతాలు


ఆంధ్రా సుగర్స్ ఎదురుగా బండ్‌పై పిచ్చిమొక్కలు

గోదావరి బండ్ నిర్వహణ చేపట్టాలి.

గోదావరి బండ్‌పై రోడ్డు కం రైలు బ్రిడ్జి నుం చి గామన్ వంతెన వరకు ప్రతిరోజు నిర్వహణ కోసం తోటమాలి, నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటుచేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిర్వహణ ఖర్చును తగ్గించుకునేందుకు లాంచీలరేవు, గోష్పాదక్షేత్రం, టోల్ గేట్, సుబ్రహ్మణ్య స్నానఘట్టాల వద్ద అద్దె ప్రాతిపదికన మున్సిపల్ షాపిం గ్ కాంప్లెక్స్‌లు నిర్మాణాలు చేపట్టినట్లయితే ము న్సిపాల్టీకి కొంత భారం తగ్గడంతో పాటు ఆదా యం సమకూరుతుందని, నియోజకవర్గంలోని పలు పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల యజమానులు తమ కంపెనీల సీఎస్ఆర్ నిధులతో గోదావరి బండ్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దే విదంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దుమ్ము పట్టిపోతున్న రుడా పార్క్

కొవ్వూరు లాంచీలరేవు నుంచి గోష్పాదక్షేత్రంలోని ఆంధ్రసుగర్స్ వరకు ఉన్న గోదావరి బండ్‌ను రుడా నిధులతో పార్క్‌గా బొమ్మలు ఏర్పాటుచేసి అభివృద్ధి చేశారు. పార్క్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకుండానే పార్క్‌లో ఏర్పాటుచేసిన ఏనుగు బొమ్మ మరమ్మతులకు గురయ్యింది. పార్క్‌లోకి వచ్చినవారు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన సిమెంట్ దిమ్మలకు అంటించిన మార్బుల్ పలకలు పనులు నాణ్యత లేకపోవడంతో ఊడి కిందపడిపోతున్నాయి. గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులు, యాత్రికులతో పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన గోదావరి బండ్‌ను రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టులో అభివృద్ధి చేస్తున్న మాదిరిగా కొవ్వూరులోనూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.